

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV – STRUGGLE FOR JUSTICE


సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 243 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 30, జూలై 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





# బీసీల పట్ల బీజేపీ ద్వంద్వ వైఖరి

డాక్టర్ బరిగెల శివ

**జై భీమ్ డెస్క్ (హైదరాబాద్)**

స్థానిక సంస్థలలో బీసీలకు 42 స్థానాలు కేటాయిస్తూ,ఆ మేరకు రాజ్యాంగంలో 9వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలను తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు వ్యతిరేకించడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనంగా నిలుస్తోంది. రిజర్వేషన్లు వంటి ప్రభుత్వ పక్షాలు వంటి కీలకమైన అంశాల విషయంలో రాష్ట్ర నిర్ణయం తీసుకునే అవకాశం, సంబంధిత న్యాయస్థానాల్లో సవాలు చేసే అవకాశం ఉంటుంది. తాము ప్రతిపాదించిన స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్ అమలు నిర్ణయాన్ని ఎవరూ న్యాయస్థానంలో సవాలు చేసి, నిలుపుదల చేయకుండా ఈ ప్రక్రియ కోసం రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో పొందుపరచాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. తెలంగాణ ప్రభుత్వం పంపిన బీసీ రిజర్వేషన్ 9 షెడ్యూల్‌లో పొందుపర్చడం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు. కానీ దీనికంటే ముందే తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రామచంద్రరావు సాధ్యం కాదని తెగేసి చెప్పారు. ఆయనకు బీసీలపట్ల వున్న వ్యతిరేకతను ఆయన మాటలు చెబుతున్నాయి. ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన బీసీ బిల్లు , అత్యంత కీలకమైన అంశాలలో ఒకటి. ఇటువంటి కీలకమైన అంశంలో, రాష్ట్ర అధ్యక్షులు ఆ పార్టీ కేంద్రనాయకులతో సంప్రదించకుండా బిల్లు ఆమోదించడం సాధ్యం కాదని ప్రకటించారు. రామంచద్రరావు ప్రకటనను బట్టి, తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్ రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో పొందుపరచడానికి కేంద్ర ప్రభుత్వం

- మిగతా 2లో..



**డాక్టర్ బరిగెల శివ**

జై భీమ్ సంస్థల ఫౌండర్, ఛైర్మన్





## భూ వివాదం కేసులో రేవంత్ రెడ్డికి ఊరట

పెద్దిరాజు తదితరులు వేసిన పిటిషన్ తిరస్కరణ

ఫిర్యాదుదారుకు కోర్టు ధిక్కరణ కింద నోటీసులు

4

## ఢిల్లీలో తెలుగు జర్నలిస్టుల సంక్షేమమే మా ఏజెండా

ఢిల్లీ తెలుగు జర్నలిస్టుల అసోసియేషన్ (డిటిజెఎ)

ఢిల్లీ జర్నలిస్టులకు అక్రిడేషన్, హెల్త్,ఇళ్ల స్థలాల సమస్యల లిపరిష్కారానికి కృషి చేస్తాం

తెలంగాణ,ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్లు కె. శ్రీనివాస్ రెడ్డి , ఆలపాటి సురేష్

3







## చిలుకు స్వామి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసిన (హెచ్.ఎస్.సి) ఇంటర్నేషనల్ తియాలజికల్ యూనివర్సిటీ(హెచ్ఎస్సియు)

3



## బిసి రిజర్వేషన్ల కోసం 72 గంటల నిరాహార దీక్ష

ప్రభుత్వ అనుమతితో 4 నుంచి దీక్షకు దిగుతా

లేదంటే ఎక్కడుంటే అక్కడే దీక్ష చేస్తా

జాగృతి అధ్యక్షురాలు కవిత హెచ్చరిక

2



## నిండుకుండలా నాగార్జున సాగర్

14 గేట్లు ఎత్తి నీటిని విడదల చేసిన మంత్రులు

18 ఏళ్ల తరవాత జూలైలో ఈ మోతాదులో నీటి చేరిక

వివరాలు 2లో



2

## రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తాం

ప్రాజెక్టుల్లో పేరుకున్న పూడికను తొలగిస్తాం

26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న సాగర్

మంత్రి అడ్లూరితో కలసి సాగర్ గేట్లు ఎత్తిన మంత్రి ఉత్తమ్

## మానసిక సమస్యలతో సతమతం

ఆఫీస్ నుంచి దూకి టెక్కీ ఆత్మహత్య

వివరాలు 2లో

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తాం

**ప్రాజెక్టుల్లో పేరుకున్న పూడికను తొలగిస్తాం**
**26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న సాగర్**
**మంత్రి అడ్లూరితో కలసి సాగర్ గేట్లు ఎత్తిన మంత్రి ఉత్తమ్**

**నాగార్జునసాగర్,జూలై29(జై భీమ్ న్యూస్):**

రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తామని,అలాగే పూడిక తీస్తామని ,రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ ,మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని అన్నారు. నాగార్జున సాగర్ మనకు ఆధునిక దేవాలయం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సాగర్ నుంచి గేట్లు ఎత్తడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. 18 ఏళ్ల తర్వాత జులైలోనే నాగార్జున సాగర్ జలాశయం నిండిందని తెలియజేశారు. సాగర్ కు దివంగత ప్రధాని నెహ్రూ గాంధీ పునాది వేస్తే దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని, 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించిన గొప్ప ప్రాజెక్టు ఇది అని కొనియాడారు. సాగర్ కాలువల ద్వారా రెండు రాష్ట్రాల్లోని ప్రతీ ఎకరాకు నీరు చేరిందని, మన రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి పండిందని ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని 22 లక్షల ఎకరాలకు సాగునీరుతుందని చెప్పారు .జవహర్ కుడి కాలువ ద్వారా 11.74 లక్షల ఎకరాలు, లాల్ బహుదూర్ ఎడమ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు- వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 6 లక్షల 50వేల ఎకరాలకు సాగు నీరు అందుతుండగా, నల్గొండ జిల్లాలో 1,50,000 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో రెండు లక్షల 30 వేల ఎకరాలు ,ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్ష ఎకరాలకు ఆయకట్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరందుతున్నదని తెలిపారు. 2005 సంవత్సరంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు స్వర్ణోత్సవాలు. నిర్వహించడం జరిగిందని చెప్పారు.తను ఆరుసార్లు శాసనసభ్యుడిగా,ఒకసారి పార్లమెంటు సభ్యునిగా ఉంటూ ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టు మంత్రిగా నాగార్జున సాగర్ ద్వారా నీటిని వదలడం సంతోషంగా ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటు- అయిన తర్వాత గత వానాకాలం,యాసంగి , వానాకాలం కలిసి రెండు లక్షల 81 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని. పండించడం జరిగిందని, ఇందులో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పాత్ర ముఖ్యమని అన్నారు. సాగునీటితో పాటు- నాగార్జునసాగర్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా గడచిన 4 రోజులుగా 30000 క్యూసెక్కుల నీటిని తో పూర్తిస్థాయిలో,700 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామన్నారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహాన్,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ ఈ మల్లికార్జునరావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. కాగా నాగార్జున సాగర్ ప్రాజక్ట్ ద్వారా మంత్రులు 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువ కు వదిలిన తర్వాత అధికారులు 14 గేట్ల ద్వారా 10932 క్యూసెక్కుల నీరు వదిలారు.మంగళవారం సాయంత్రం వరకు 20 గేట్ల ద్వారా 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదలనున్నట్లు- ప్రాజక్ట్ అధికారులు తెలిపారు. అనంతరం మంత్రులు,అధికారులు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ను సందర్శించి కృష్ణ జలాలకు పుష్పాభిషేకం చేశారు.



# బీసీల పట్ల బీజేపీ ద్వంద్వ వైఖరి

మొదటి పేజీ తరువాయి

సిద్ధంగా లేదు.

**రక్షణ కవచంలా 9వ షెడ్యూలు..**

ఈ సందర్భంగా అసలు 9వ షెడ్యూల్ అంటే ఏంటి? అనే ప్రశ్న చాలామందిలో తలెత్తుతుంది. భారత రాజ్యాంగానికి 1951లో తొలిగా చేసిన రాజ్యాంగ సవరణ ద్వారా ఈ తొమ్మిదో షెడ్యూల్ ఏర్పడింది. ప్రజలకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వాలు లేదా కేంద్ర ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలను తొమ్మిదో షెడ్యూల్‌లో పొందుపరిచే కీలక పక్షంలో, ఆయా నిర్ణయాలపై ఎవరు కోర్టులో సవాల్ చేయకుండా రక్షణ కల్పిస్తుంది. దేశంలో తొలిసారిగా బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విధంగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈ నిర్ణయాన్ని ఇతరులు అభ్యంతరం పెట్టకుండా ఉండాలంటే, రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో కచ్చితంగా పొందుపరచాల్సి ఉంటుంది. అయినా,కీలకమైన అంశాలను 9వ షెడ్యూల్లో పొందుపరచటం కొత్తేమీ కాదు. 9వ షెడ్యూల్ ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు 284 అంశాలను పొందుపర్చారు. అందులో ఎక్కువ భాగం అగ్రవర్ణాలకు చెందిన వ్యవసాయ భూములకు సంబంధించిన మినహాయింపులు వంటి అంశాలు రక్షణ పొందుతున్నాయి. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని న్యాయస్థానాలు ఆంక్షలు విధించిన నేపథ్యంలో తమిళనాడులో బీసీలకు సంబంధించి 69 శాతం రిజర్వేషన్లు అమలు కావడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల విధానాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో పొందుపరచటం వల్లనే సాధ్యమైంది. లేదంటే 69 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా చాలామంది న్యాయస్థానాలలో అడ్డు పుల్లలు వేసి ఉ0డేవారు. బీసీ రిజర్వేషన్‌ను వ్యతిరేకించడం ద్వారా బీసీల పట్ల తనకున్న వ్యతిరేకతను బీజేపీ మరోసారి రుజువు చేసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్రమోది బీసీ వర్గానికి చెందినవారని, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామంటూ నిత్యం బీసీల నామజపం చేసే బీజేపీ నేతలు ఆచరణకు వచ్చే సరికి తమ అసలు బుద్ధి ప్రదర్శిస్తున్నారు. బీజేపీ చరిత్ర గమనిస్తే అడుగడునా బీసీల పట్ల ద్వేషమే కనిపిస్తుంది. గతంలో మండల కమిషన్ సిఫార్సుల మేరకు విద్యా ఉద్యోగాలలో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు నాటి ప్రధాని వీపీ సింగ్ ప్రకటించినప్పుడు కూడా, మండల సిఫార్సులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో బీజేపీ తమ పార్టీ అనుబంధమైన విద్యార్థి సంస్థ అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రూపంలో వ్యతిరేకించింది. ఎట్టకేలకు మండల్ కమిషన్ సిఫార్సులకు సుప్రీంకోర్టు ఆమోదం తెలపటం వల్ల ఆనాడు సమస్య పరిష్కారమైంది. బీసీ కులాలను వర్గీకరణ చేయడం ద్వారా బీసీలలో అత్యంత వెనుకబడిన కులాలకు మేలు చేస్తామంటూ ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన జస్టిస్ రోహిణీ కమీషన్ దేశవ్యాప్తంగా పర్యటించి, దేశంలో మొత్తం 3000 బీసీ కులాలలో దాదాపు 90 శాతం కులాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోక ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి వున్నాయని నివేదిక సమర్పించింది. ఆ నివేదిక సమర్పించి రెండు సంవత్సరాలు కావస్తుంది. అయినప్పటికీ ఆ నివేదిక ఊసే బీజేపీ ఎత్తడం లేదు. తెలంగాణలో ప్రతిపాదించిన స్థానిక సంస్థలలో 42 శాతం మండల కమిషన్ బీసీలకు కూడా ఎస్సీ ఎస్టీ వర్గాల మాదిరిగానే చట్టసభలలో రిజర్వేషన్ కల్పించాలని కూడా సూచన చేసింది. అయితే చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్ బిల్లు విషయంలో ఎంతో శ్రద్ధ వహించిన బీజేపీ ప్రభుత్వం మహిళలకు కేటాయించిన సీట్లలో బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్‌ను బీజేపీ ఖాతరు చేయలేదు. ఈ స్థితిలో చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్న మండల కమిషన్ సిఫార్సులను బీజేపీ అధికారంలో ఉన్నంతకాలం చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్ అమలు కాదని అర్థమవుతుంది. ఇదేసమయంలో, ఆర్థికంగా కులాలకు ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని ఏ రాజకీయపార్టీ కోరలేదు. ఎవరూ ఉద్యమాలు చేయలేదు. కానీ, కేంద్ర ప్రభుత్వం దేశంలో కనీసం 15 శాతం కూడా లేని అగ్రకులాల వారికి పేదరికం పేరుతో పది శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోంది. రిజర్వేషన్లు 50 శాతం పెంచకూడదని సన్నాయి నొక్కులు నొక్కిన న్యాయస్థానాలు,ఈ అంశంపై అభ్యంతరం చెప్పకపోగా ఆమోదం తెలిపాయి. సనాతన ధర్మం ప్రకారం,బీసీ కులాలకు చెందిన ప్రజలు అగ్రవర్ణాలకు సేవలు చేయటం మినహా అగ్రవర్ణాలతో సమానంగా అధికారంలో పాలుపంచుకోవడం బీజేపీకి ఇష్టం లేదనిపిస్తోంది. కావాలంటే మీకు ఉచితంగా బియ్యమో,గ్యాస్ బండో ఇస్తాం కానీ అధికారం ఎలా ఇస్తామనే ఆది పెద్ద ధోరణి బీజేపీలో కనిపిస్తోంది.

# వీర్యదానం చేస్తే రూ. 5వేల నుంచి పదివేలు

**టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ఘటనలో విస్తుపోయే విషయాలు..!**
**సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ లో ఘటన**

**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)**

డాక్టర్ నమ్రత సహా 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. భర్త వీర్యానికి బదులుగా వేరొకరి వీర్యంతో సంతానం కలిగించినట్లు డీఎన్ఏ పరీక్షలో తేలడంతో ఈ దందా వెలుగులోకి వచ్చింది.గుర్తు తెలియని వ్యక్తులకు రూ. 5-10 వేలు చెల్లించి పోర్న్ వీడియోలు చూపిస్తూ,ఆరోగ్య ప్రమాణాలు లేకుండా వీర్యాన్ని సేకరించినట్లు గుర్తించారు. అలా సేకరించిన వీర్యాన్ని గుజరాత్,మధ్యప్రదేశ్‌లకు తరలిస్తున్నట్లు తేలింది. సికింద్రాబాద్ గోపాలపురం యూనివర్సల్ సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఒక మహిళ తన భర్త వీర్య కణాలతో గర్భం కావాలని.. టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను ఆశ్రయించగా.. భర్తకు బదులుగా వేరే వ్యక్తి వీర్య కణాలతో గర్భం కలిగించినట్లు తెలిసింది. డీఎన్ఏ పరీక్షలో ఇది రుజువు కావడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నార్త్ జోన్ డీసీపీ సాధన లక్ష్మి పెరమల్ సారథ్యంలో శనివారం సాయంత్రం నుంచి ఇవాళ తెల్లవారుజాము వరకు తనిఖీలు కొనసాగాయి పోలీస్ అధికారులు, రెవెన్యూ శాఖ సిబ్బంది పలువురి నుండి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఆసుపత్రిలో కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్న వైద్యశాఖ అధికారులు, ఆసుపత్రిని సీజ్ చేయనున్నట్లు తెలిపారు. దీంతో, ఆసుపత్రి సిబ్బందిని మరోచోటికి తరలించారు. ఇదిలావుండగా, వీర్య కణాల అక్రమ సేకరణ గుట్టు రట్టు చేశారు. క్లినిక్ నిర్వాహకులు పోర్న్ వీడియోలు చూపిస్తూ.. వీర్య కణాలను సేకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. 16 వీర్య కణాల శాంపిల్స్‌ను స్వాధీనం చేసుకుని %ణవీఎూ% (జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి)కి అప్పగించారు. నిందితులు సరోగసీ కోసం వీర్య కణాలను సేకరిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ.. ఇక్కడ సేకరించిన శాంపిల్స్‌ను అహ్మదాబాద్‌కు పంపుతున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాల అక్రమాలు దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నట్లు వెల్లడైంది. విశాఖపట్నం, విజయవాడల్లోని ఈ సంస్థ బ్రాంచీల్లోనూ పోలీసులు సోదాలు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కోల్‌కతాలలో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాలు బ్రాంచీలను నిర్వహిస్తున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.ఈ ఆసుపత్రి నిర్వాహకులపై గతంలో కేపీహెచ్‌బీ, గోపాలపురం పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.ఓ వైద్యురాలి లైసెన్స్ రద్దు చేసినప్పటికీ, మరొక వైద్యురాలి పేరుతో అక్రమ సరోగసీ దందాను కొనసాగిస్తున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.ఇక ఈ ఘటన హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అక్రమ సరోగసీ, వీర్య కణాల సేకరణ కేంద్రాలపై తీవ్ర చర్చకు దారితీశాయి.ఇలాంటి మోసపూరిత కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.



# మానసిక సమస్యలతో సతమతం

**ఆఫీస్ నుంచి దూకి టెక్కీ ఆత్మహత్య**

**ముంబై,జూలై29(జై భీమ్ న్యూస్) :**

మహారాష్ట్రలోని పుణెలో ఓ ఐటీ- ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారు. జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. ఆఫీసులో మీటింగ్ జరుగుతుండగా మధ్యలో బయటకు వెళ్లిన ఆ టెకీ.. భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నాసిక్‌కు చెందిన 23 ఏళ్ల పీయూష్ అశోక్ కవాడే పుణెలోని హింజెవాడి ఐటీ- పార్క్‌లోని ఓ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. రోజూలాగే సోమవారం ఉదయం ఆఫీసుకు వచ్చిన అతడు కంపెనీ మీటింగ్‌కు హాజరయ్యాడు. మధ్యలో అస్వస్థతగా ఉందని చెప్పి మీటింగ్ నుంచి బయటకు వచ్చాడు. ఆ తర్వాత కొన్ని క్షణాలకే బిల్డింగ్ ఏడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తోటి ఉద్యోగులంతా ఉలిక్కిపడ్డారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద సూసైడ్ నోట్‌ను గుర్తించారు. జీవితంలో విఫలమయ్యా. నన్ను క్షమించండి. మీకు కొడుకుగా ఉండేందుకు నాకు అర్హత లేదని కుటుంబసభ్యులనుద్దేశిస్తూ లేఖ రాసినట్లు- పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు- తెలిపారు. పీయూష్ గతేడాది జులైలోనే ఈ కంపెనీలో చేరాడు. పనిఒత్తిడి, మానసిక సమస్యల కారణంగానే అతడు బలవన్మరణానికి పాల్పడి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# బిసి రిజర్వేషన్ల కోసం 72 గంటల నిరాహార దీక్ష

**ప్రభుత్వ అనుమతితో 4 నుంచి దీక్షకు దిగుతా**
**లేదంటే ఎక్కడుంటే అక్కడే దీక్ష చేస్తా**
**జాగృతి అధ్యక్షురాలు కవిత హెచ్చరిక**

**హైదరాబాద్,జూలై29(జై భీమ్ న్యూస్):**

బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆగస్టు 4, 5, 6 తేదీల్లో తాను 72 గంటల పాటు నిరాహార దీక్ష చేయబోతున్నానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ప్రకటించారు. ప్రభుత్వ అనుమతి కోరి దీక్షకు దిగుతానని ఒక వేళ అనుమతి ఇవ్వకపోతే ఎక్కడ కూర్చుంటే అక్కడే నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహ సాధన కోసం తాను 72 గంటలు దీక్ష చేస్తే నాటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తు చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ .... 2018 పంచాయతీ రాజ్ సవరణ చట్టాన్ని సవరణ చేస్తూ తెలంగాణ జాగృతి చేసిన డిమాండ్ తోనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసిందని చెప్పారు. తమిళనాడులో గవర్నర్ జాప్యం చేస్తే కోర్టుకు వెళ్లి తీర్పు తెచ్చుకున్నారని మరి తెలంగాణ ప్రభుత్వం గవర్నర్ వద్ద పెండింగ్ అంశంపై కోర్టుకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. గవర్నర్, రాష్ట్రపతి వద్ద ఉన్న పెండింగ్ బిల్లులపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్తే సానుకూల తీర్పు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కోర్టులో కేసు వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీకి ఉన్న ఒప్పందం కారణంగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్టుకు వెళ్లడం లేదని కవిత ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేయాలన్నారు. తాము ఢిల్లీలో చేసే ధర్నాకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అంటు-న్నారు... ఇదేమైనా సత్రం భోజనమా ? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అఫీషియల్ గా అఖిలపక్షంను ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షం ఢిల్లీకి రావాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, అన్ని రాజకీయ పార్టీలకు ప్రభుత్వం లేఖలు రాయలన్నారు. పొన్నం ప్రభాకర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం డ్రామా చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా శూన్యం అని రిజర్వేషన్ల విషయంలో బీజేపీ తప్పించుకుంటోందని విమర్శించారు. బీజేపీ బీసీ సీఎం, బీసీ పీఎం అంటు-న్న బీజేపీకి బీసీలపై చిత్తశుద్ధి లేదని కవిత ధ్వజమెత్తారు.

# నిండుకుండలా నాగార్జున సాగర్

**14 గేట్లు ఎత్తి నీటిని విడదల చేసిన మంత్రులు**
**18 ఏళ్ల తరవాత జూలైలో ఈ మోతాదులో నీటి చేరిక**

**నాగార్జునసాగర్,జూలై29(జై భీమ్ న్యూస్) :**

ఎగువ నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు- ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థం 590.00అడుగులకుగాను ప్రస్తుతం 586.60 అడుగులకు చేరింది. ప్రాజెక్టు గేట్లు- ఎత్తిన నేపథ్యంలో.. దిగువ భాగంలో లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. 18 ఏళ్ల తర్వాత.. నెల ముందుగానే నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేయడం ఇదే తొలిసారి. వరద ప్రవాహం పెరగడంతో మంగళవారం నాగార్జున సాగర్ గేట్లను ఎత్తారు. మంత్రులచేతుల మీదుగా ఉదయం 11 గంటలకు గేట్లను తెరిచారు. మొత్తం 14 గేట్లను 5 అడుగుల మేర ఓపెన్ చేశారు. అయితే సాగర్ గేట్లను ఎత్తడానికి ముందు బేగంపేట ఎయిర్‌పోర్టులో మంత్రుల గొడవపడ్డారు. షెడ్యూల్ ప్రకారం నల్లగొండ జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా మంగళవారం ఉదయం 10 గంటలకు నాగార్జున సాగర్ గేట్లను తెరువాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటలకు అందరూ బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నాగార్జునసాగర్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అనుకున్న ప్రకారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ ఉదయం 9 గంటలకే బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. కానీ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గంట ఆలస్యంగా 10 గంటలకు వచ్చారు. ఈ విషయంలో కోమటిరెడ్డికి, ఉత్తమ్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తాను నాగార్జునసాగర్‌కు రానని అలిగి బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లిపోయారు. దాంతో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ మాత్రమే హెలికాప్టర్‌లో నాగార్జునసాగర్‌కు వెళ్లారు. పూజా కార్యక్రమం నిర్వహించి సాగర్ 14 గేట్లను ఎత్తారు. దాంతో కృష్ణమ్మ దిగువకు పరవళ్లు తొక్కుతూ పరుగులు తీస్తోంది. కాగా నాగార్జునసాగర్ జూలై నెలలో ఈ స్థాయిలో నిండటం గడిచిన 18 ఏళ్లలో ఇదే తొలిసారని అధికారులు తెలిపారు.



# సంపాదకీయం

## పులుల సంరక్షణతోనే జీవ వైవిధ్యం !

దేశంలో పర్యావరణంపై ఆసక్తి, శ్రద్ధ లేకుండా పోతోంది. మానవజాతి పెరుగుతున్నా కొద్దీ పక్కనున్న ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారు. అడవులను నరికివేస్తూనే..అడవుల్లోని జంతుజాలాన్ని కూడా ఉనికి లేకుండా చేస్తున్నారు. దీంతో ఇప్పటికే అనేక జంతుజాతులు నశించాయి. మనం బతికితే చాలు...మిగతా ఏమయితే ఏమిటన్న ధోరణి ప్రబలింది. ఈ క్రమంలో అడవుల విధ్వంసంతో జంతుజాలం నశిచింది. ప్రపంచవ్యాప్తంగా విచక్షణారహితంగా అడవుల నరికివేత, అక్రమంగా పులులను వేటాడడం లాంటి పలు కారణాలతో పులి జాతి అంతరించే స్థాయికి చేరడాన్ని గమనించిన ఐరాస ప్రతి ఏట 29 జులై రోజున 'అంతర్జాతీయ పులుల దినం లేదా ఇంటర్నేషనల్ టైగర్ డే' పాటించడం ఆనవాయితీగా మారింది. 2010 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. పులులను కాపాడుకోవడం, వాటి ఆవాసాలను సంరక్షించుకోవడం, అక్రమ వేటలను మానుకోవడం, జీవ వైవిధ్యాన్ని కాపాడే ప్రాధాన్యాన్ని వివరించడం, టైగర్ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేయడం, టైగర్ రిజర్వులను నియంత్రించడం లాంటి అంశాల్లో సామాన్య జనాలకు అవగాహన కల్పించడానికి ఈ వేదికలను ఉపయోగించుకోవాలి. పిల్లుల జాతిలో అతి పెద్ద జంతువుగా పులికి పేరుంది. 2025 అంతర్జాతీయపులుల దినం ఇతివృత్తంగా మానవులు, పులులు సామరస్యంగా సహజీవనం చేయడం అనే అంశాన్ని తీసుకొని పులుల సంరక్షణ బాధ్యతలను వివరించడం జరుగుతుంది. ఇటీవల ఆదిలాబాద్ కవ్వాల్ రక్షణకు జివో 49ని తెలంగాణ ప్రభుత్వం తీసుకుని వచ్చింది. కానీ అందరూ ఒక్కటై దానిని అమలు చేయకుండా పక్కన పెట్టేయించారు. ఇది అమలు చేయడం ద్వారా పులుల సంరక్షణకు ప్రభుత్వం పూనుకుంది. కానీ గిరిజనుల జీవనానికి ఇది అడ్డంకిగా మారిందన్న ఆందోళనతో పులుల రిజర్వ్ ఫారెస్ట్ రోణ పక్కకు పోయింది. నిజానికి ఇది ప్రజల్లో అవగాహన లేమి కారణంగా జరుగుతున్నదని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. జీవవైవిధ్యం కాపాడటంలో పులులదే కీలక పాత్ర. వాటికి తెలియకుండానే అడవిని రక్షిస్తుంటాయి. మొక్కలను తినే జీవ జాతులను పులులు చంపి తినకపోతే అడవి అనేదే మిగలదు. అంటే...సాధు జంతువులను వేటాడుతూ...పులులు ఎకో సిస్టమ్‌ను బ్యాలెన్స్ చేస్తూ ఉంటాయి. అయితే రానురాను అడువులు ధ్వంసం అవుతుండటం వల్ల వీటి సంఖ్య తగ్గిపోతోంది. అవి మనుగడ సాగించేందుకు అవసరమైన అనుకూల వాతావరణం ఉండటం లేదు. క్రమంగా ఇవి అంతరించి పోయే ప్రమాదముందని గుర్తించిన ప్రపంచ దేశాలు, ఏటా జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం జరుపుకుంటున్నారు. ఒక పులి సంచరించే ప్రాంతం చుట్టు-పక్కల మరో పులి సంచరించదు. 25 నుంచి 30 కిలోమీటర్ల మేర ఒక పులి తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తుంది. ఫుడ్ పిరమిడ్లో అగ్రస్థానంలో ఉండే పెద్ద పులి నివసించాలంటే ప్రాంతంలో చిన్నా, పెద్దా అన్నిరకాల జంతువులుండాలి. మంచి వర్షపాతం ఉండాలి. పచ్చని చెట్లతో కూడిన దట్టమైన అడవి ఉండాలి. అందుకే ఈ లెక్కన ఇప్పుడున్న పరిస్థితుల్లో పులులు. మనుగడ సాగించాలంటే...ఒక్కో పులికి 25 వేల ఎకరాల అడవిని కాపాడుకోవాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు తేల్చిచెప్పారు. పులి తన ప్రాణాలు కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతుంది. మూడేళ్ల వయసు రాగానే మగ పులి సొంత సామ్రాజ్యాన్ని ఏర్పాటు-చేసుకునేందుకు ప్రయత్నిస్తుంది. అయితే అడవులు అంతరించడం. అడవుల్లో నీటి కుంటలు లేకపోవడం వల్ల అవి ఊళ్లలోకి రావాల్సి వస్తోంది. నగరాలు పెరగడం, గ్లోబలైజేషన్ ప్రభావంతో రానురానూ అడవులు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం 93 శాతం పులులు కేవలం అడవుల నరికివేత వల్ల అంతరించిపోతున్నాయని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ప్రస్తుతం కేవలం ఆరు జాతుల పులులు మాత్రమే మనుగడ సాగిస్తున్నాయి. అనేక టైగర్ జాతులు పూర్తిగా అంతరించి పోయాయి. 2014 వరల్డ్ వైడ్ ఫండ్ లెక్కల ప్రకారం వందేళ్ల క్రితం సుమారు లక్ష పులులు ఉండేవి. కాని ఇప్పుడు వాటి సంఖ్య చాలా తగ్గిపోయిందని వరల్డ్ వైడ్ ఫండ్ ప్రతినిథులు చెబుతున్నారు. పులుల సంఖ్య పెరగడం ద్వారా ఎకో సిస్టమ్ లో మంచి మార్పులు రావడమే కాకుండా, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుంది. పులులు అంతరిపోవడానికి వేట, వాతావరణ మార్పులతోపాటు, పులులకు షెల్టర్ లేకపోవడం ముఖ్యమైన కారణాలు. అంతేకాకుండా పులి చర్మం, గోళ్లకు డిమాండ్ ఎక్కువ. చైనీస్ సంప్రదాయ వైద్యంలో పులుల గోళ్లు, పళ్లు,మీసాలను ఉపయోగిస్తారు. వాటి కోసం ఎక్కువ ధర చెల్లిస్తారు. అందుకే పులుల వేట, స్మగ్లింగ్ కూడా ఎక్కువైంది. దీంతో కేవలం పులులు మాత్రమే కాదు. ఇతర జీవులు కూడా మెల్లగా అంతరిస్తున్నాయి. కేవలం అడవుల్ని నరకడం వల్లనే దాదాపు 93 శాతం వాటి ఆవాసాల్ని కోల్పోతున్నాయని సర్వేలు వెల్లడిస్తున్నాయి. పులుల్ని, ఇతర జీవరాశులని సంరక్షించుకోవాలంటే.. అడవులు పెంచడం ఒక్కటే మార్గమని అర్థం అవుతోంది. అడవులు పెంచడం ద్వారా జంతువుల సంఖ్య పెరగడమే కాక పర్యావరణ సమతుల్యం కూడా దెబ్బ తినకుండా ఉంటుంది. వాతావరణ మార్పులు కూడా జంతువులు అంతరించ డానికి కారణం కాబట్టి వాతావరణ మార్పులకు కారణమయ్యే ప్లాస్టిక్, కాలుష్యాన్ని కూడా తగ్గించాల్సిన అవసరం ఏర్పడింది. మనదేశంలో పులి జాతీయ జంతువు కాబట్టి కొంతవరకైనా పులుల్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా మేలుకోకపోతే ఉన్న నాలుగు జాతులు కూడా అంతరించిపోయే ప్రమాదం ఉందని గత కొన్నేళ్ల నుంచి -టైగర్ ట్రాకర్స్ వ్యవస్థను బలపరిచారు. ప్రపంచం మొత్తం మీద ఉన్న పులుల సంఖ్యలో సగానికి పైగా మనదేశంలోనే ఉన్నాయి. పులులను కాపాడుకోవల్సిన అవసరాన్ని మనదేశం ఎప్పుడో గుర్తించింది. 1972లోనే పులిని జాతీయ జంతువుగా ప్రకటించి, తర్వాతి ఏడాది నుంచే ప్రాజెక్ట్ -టైగర్ ను ప్రారంభించింది. పులుల్ని వేటాడే వారికి కఠిన శిక్షలు పడేలా చట్టాలు తెచ్చినా వాటి అంతం ఆగడం లేదు. వాటి సంరక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తోంది. దేశంలో 48 పులి అభయారణ్యాలను ఏర్పాటు-చేశారు. పులుల సంరక్షణ గురించి ప్రజల్ని చైతన్యవంతం చేయడం కోసం ఇండియన్ రైల్వే.. టైగర్ ఎక్స్ ప్రెస్ పేరుతో టూరిస్ట్ రైలు సేవలను కూడా ప్రారంభించింది. ఇందులో బాంధవగడ నేషనల్ పార్క్, కన్హా నేషనల్ పార్కులో సఫారీకి తీసుకెళ్తారు.ప్రపంచ పులుల్లో 70 శాతానికి పైగా భారత్‌లోనే ఉండడం విశేషం. నేడు పులుల జనాభా వృద్ధి రేటు- 6.1 శాతంగా నమోదు అవుతున్నది. శతాబ్దం క్రితం ఒక లక్ష వరకు ఉన్న పులులు నేడు కేవలం 5,574 మాత్రమే ఉండడం విచారకరం. పులుల ఆవాసాలైన అడవులను నరికి వేస్తుండటంతో అవి మానవ ఆవాసాల్లోకి రావడం జరుగుతోంది.పులుల్లో చాలా అరుదైన జాతి రాయల్ బెంగాల్ -టైగర్.. దీన్ని పెద్ద పులి అంటారు. ఇది మన దేశం లో తప్ప ఇంకెక్కడా కనిపించదు. బెంగాల్ టైగర్ గాండ్రింపు సుమారు రెండు కిలోమీటర్ల వరకు వినిపిస్తుంది. ఇవి రోజుకు దాదాపు 21 కిలోల మాంసాన్ని తింటాయి. పులులు అడవిలో వాటి సరిహద్దులను అవే ఏర్పాటు-చేసుకుంటాయి. ఆ సరిహద్దులకు లోపల వున్న ప్రాంతమంతా వాటి సామ్రాజ్యమే. ఆ సరిహద్దులు దాటి ఏ ఇతర జంతువులు ప్రవేశించినా వాటికి మరణమే. ప్రతి రెండేళ్లకోసారి ఒక్కో ఆడ పులి రెండు నుంచి నాలుగు పిల్లల్ని పెడుతుంది. పులులు పుట్టిన 18 నెలల నుంచే వేటాడటం మొదలు పెడతాయి. ఇలా పులలను రక్షిస్తేనే అడవులు పెరుగుతాయి. జీవవైవిధ్యం పెరుగుతుందని గుర్తించాలి.



# ఢిల్లీలో తెలుగు జర్నలిస్టుల సంక్షేమమే మా ఏజెండా

**ఢిల్లీ తెలుగు జర్నలిస్టుల అసోసియేషన్ (డిటిజెఎ)**
**ఢిల్లీ జర్నలిస్టులకు అక్రిడేషన్, హెల్త్,ఇళ్ల స్థలాల సమస్యల లిపరిష్కారానికి కృషి చేస్తాం**
**తెలంగాణ,ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్లు కె.లి శ్రీనివాస్ రెడ్డి , ఆలపాటి సురేష్**

**ఢిల్లీ (జై భీమ్ న్యూస్)**

ఢిల్లీ జర్నలిస్టులకు అన్ని విధాలా అండగా ఉంటామన్న తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే)నేతలు విరాహత్ అలీ, రాంనారాయణ ఐవీ సుబ్బారావు.

**ఢిల్లీ తెలుగు జర్నలిస్టుల అసోసియేషన్(డిటిజెఎ) నూతన కమిటీ ఎన్నిక..**

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజేయు)కు అనుబంధంగా పనిచేస్తున్న ఢిల్లీ తెలుగు జర్నలిస్ట్స్ అసోసియేషన్ (డిటిజెఎ) సమావేశం మంగళవారం సాయంత్రం తెలంగాణ,ఆంధ్రా భవన్ లోని గురజాడ కాన్ఫరెన్స్ హాలు లో విజయవంతంగా జరిగింది. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు టి. శ్రీనివాస రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రస్తుత కమిటీ సభ్యులతో పాటు మరికొందరు మీడియా మిత్రులు నూతనంగా హాజరయ్యారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయు) జాతీయ అధ్యక్షులు, తెలంగాణా ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్,తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ ప్రధాన కార్యదర్శి కే.రాంనారాయణ, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే)లి అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, ఐజేయూ నాయకులు అమర్, నరేందర్ రెడ్డి, సోమసుందర్, మాజిద్ హాజరయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో మీడియా, జర్నలిస్టులకు సంబంధించి, ప్రత్యేకంగా ఢిల్లీలో తెలుగు మీడియా సంస్థల్లో పనిచేస్తున్న మీడియా సిబ్బంది సంక్షేమ అంశాలపై వివరంగా చర్చించడం జరిగింది. రెండు విజ్ఞాపన పత్రాలను తెలంగాణ, ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ లకు అందజేయడం జరిగింది. ఢిల్లీలో పని చేసే జర్నలిస్ట్ లకు అక్రిడేషన్, ఆరోగ్య కార్డులు, ఇళ్ల స్థలాల విషయంలో ఢిల్లీ కోటాను అమలు చేస్తామని తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పని చేసే వారికే అక్రిడేషన్ ఉండేలా కొత్త నిబంధనలు త్వరలో అమల్లోకి తెస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల స్థలాలు సైతం ఢిల్లీలో తెలుగు మీడియా సంస్థల కోసం పని చేసే జర్నలిస్టులకు తెలంగాణ, ఏపీ అనే తేడా లేకుండా అమలు చేయడానికి తమ వంతు కృషి చేస్తానని వెల్లడించారు. హెల్త్ కార్డులు అందరికి వచ్చేలా చూస్తామని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల కోసం ఢిల్లీలో పని చేసే జర్నలిస్టులకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రభుత్వాల నుంచి సహకారం అందించాల్సిన అవుసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ అన్నారు. జర్నలిస్టులు మనులు, మానిక్యాలు అడగరని, కేవలం అక్రిడేషన్, ఆరోగ్యం, ఇళ్ల స్థలాలు మాత్రమే ఎక్కువగా అడుగుతుంటారని గుర్తు చేశారు. వారికి కావాల్సిన కనీస వసతులను కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి తమ వంతు సహకారం అందిస్తానని వెల్లడించారు. సీఎం చంద్రబాబు అందరికి అక్రిడేషన్లను ఇవ్వాలని చెప్పారని, అలాగే అమరావతిలో ఇండ్ల స్థలాల విషయంలోనూ ఢిల్లీ జర్నలిస్ట్ లకు అందేలా చూస్తానని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, ఎదురయ్యే ఇబ్బందుల పరిష్కారానికి తమ యూనియన్ చేస్తున్న కృషిని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) నేతలు విరాహత్ అలీ,రాం నారాయణ,ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) అధ్యక్షులు ఐవీ సుబ్బారావు వివరించారు. ఢిల్లీలో తెలుగు మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తాము కూడా పూర్తి అండగా వుంటామని, సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. అనంతరం ఢిల్లీ తెలుగు జర్నలిస్టుల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక గురించి చర్చ జరిగింది. అసోసియేషన్ కు అధ్యక్షులుగా వున్న మహాత్మా(%ఙ%9) కార్యదర్శి వర్గ సభ్యురాలు స్వరూప ఢిల్లీ నుండి హైదరాబాద్ కు బదిలీ అవ్వడం,అదే విధంగా మరికొందరు మిత్రులు అసోసియేషన్ తో కలిసి పనిచేస్తామని ముందుకు రావడంతో నూతన కమిటీ కూర్పుపై చర్చ జరిగింది. ఆలపాటి సురేష్ , శ్రీనివాస్ రెడ్డి, విరాహత్ అలీల సూచనలు, సమావేశానికి హాజరైన మీడియా జర్నలిస్టుల ప్రతిపాదనలతో ఢిల్లీ తెలుగు జర్నలిస్ట్స్ అసోసియేషన్ నూతన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




# చిలుకు స్వామి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసిన (హెచ్.ఎస్.సి) ఇంటర్నేషనల్ తియాలజికల్ యూనివర్సిటీ(హెచ్ఎస్సియు)

**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)**

నిన్న గోవాలో రాయల్ సక్సెస్ బుక్ ఆఫ్ రికార్డ్ వారు నిర్వహించిన డ్రీమ్ అచీవ్మెంట్ 2025 అవార్డు కార్యక్రమంలో HSC థియలాజికల్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ ఆఫిలిటెడ్ విత్ DTU(USA) అక్రిడిటెడ్ నాట ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్.ఆనంద్ మరియు ప్రొఫెసర్,డాక్టర్, మురళి మోహన్,ప్రొఫెసర్.కిరణ్ కుమార్గారు,ప్రొఫెసర్ పవన్ కుమార్ ,చిలుకు స్వామికి సోషల్ సర్వీస్ సేవలు గుర్తించి గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేశారు.ప్రస్తుతం చిలుకు స్వామి సౌత్ రైల్వే ఎంప్లాయ్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ సికింద్రాబాద్ (%ాజ=జుజజూ%)కి ప్రెసిడెంట్ గా ఉన్నారు గతంలో తన సొంత గ్రామమైన షారాజిపేట గ్రామం ఆలేరు మండలం యాదద్రి లో మిత్ర యువజన సేవా సంఘం స్థాపించి దాని ద్వారా ఎయిడ్స్ పైన అవగాహన సదస్సులు మరియు గ్రామం మండలంలో జిల్లా స్థాయిలో శ్రమదాన కార్యక్రమాలు,రక్తదాన శిబిరాలు, విద్య పైన, ఆరోగ్యం పైన అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి యాదమ్మ యాదగిరి లకు పేదరికంలో జన్మించి ఎంతో కష్టపడి ఉస్మానియా యూనివర్సిటీలో ఎం కం కామర్స్ పూర్తి చేసారు తెలంగాణ ఉద్యమం మరియు మాదిగ విద్యార్థి ఫెడరేషన్ లో యూనివర్సిటీలో చాలా కీలకంగా సురుగా పనిచేసారు అనంతరం పిహెచ్డి లో జాయిన్ అయిన తర్వాత కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో రైల్వేలో ట్రాక్ మెన్ గా ఉద్యోగం వచ్చాక పిహెచ్డి ని వదిలేసి ఉద్యోగంలో చేరాకా ఎంతో క్రమశిక్షణతో నిబద్ధతతో వృత్తిని నిర్వహిస్తూ నాటి నుండి నేటి వరకు రైల్వేలో ఎంతో కష్టపడి అనేక రకాల సేవా కార్యక్రమాలు చేసి అంచలంచలుగా సౌత్ ఇండియా రైల్వే ఎంప్లాయ్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ కి ప్రెసిడెంట్ గా ఎన్నికలలో నిలబడి గెలిచారు తనతో పాటు పనిచేసే ఉద్యోగులకు ఆరోగ్యం వారి పిల్లలకు విద్య కోసం అనేక రకాలుగా సహాయ సహకారాలు అందించారు ఇవన్నీ సేవా కార్యక్రమాలు HSCU ఇంటర్నేషనల్ వారు గుర్తించి గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేశారు. అనంతరం స్వామి గారు మాట్లాడుతూ ఉన్నత స్థాయికి ఎదగడమే కాకుండా తను వచ్చిన స్థానాన్ని మర్చిపోకుండా గుర్తుపెట్టుకుని సమాజంలో ప్రతి ఒక్కరూ వారి వారికి తోచినంతగా నా సేవా సహాయ కార్యక్రమాలు చేస్తూ ఒకరికి ఒకరు సహకారం అందించుకుంటూ ముందుకెళ్లాలని HSCU వారు నా సేవా కార్యక్రమాలు గుర్తించి నాకు సోషల్ సర్వీస్ గౌరవ డాక్టరేట్ ను ఇచ్చి ఇంకా పెద్ద బాధ్యతలు పెంచారు అని సంతోషాన్ని వ్యక్తపరుస్తూ రాయల్ సక్సెస్ బుక్ ఆఫ్ రికార్డు డాక్టర్.హారిక గారికి మరియు HSCU డాక్టర్,ఆనంద్ గారికి నా నా కుటుంబ సభ్యులకు నా శారాజిపేట గ్రామ ప్రజలకు నా రైల్వే సహచర మిత్రులకు నా ఆత్మీయులు అందరికీ ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను...



# ఆపరేషన్ సిందూర్‌పై సందేహాలా

**ఉగ్రమూకలను అణచివేస్తే సంతోషించరా**
**మాజీ హోంమంత్రికి ఉగ్రవాదుల ఉనికిపై అనుమానాలా**
**లోక్‌సభలో సిందూర్ అమిత్ షా ప్రసంగం**
**చిందబరం వ్యాఖ్యలపై గట్టిగా కౌంటర్**
**ముగ్గురు పహల్గా ఉగ్రవాదులను మట్టుబెట్టామని వెల్లడి**

**న్యూఢిల్లీ,జూలై29(జై భీమ్ న్యూస్):**

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారణంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ చేపట్టిన ఆపరేషన్‌పై విపక్షాలు సంతోషం వ్యక్తం చేస్తాయనుకుంటే.. సందేహాలు వ్యక్తం చేస్తున్నాయంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. లోక్‌సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో అమిషా మాట్లాడారు. విపక్ష ఎంపీల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. ఉగ్రవాదులను మట్టు-బెడితే ఆనందం వ్యక్తం చేస్తారనుకున్నానని.. కానీ విపక్ష సభ్యులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో ఒకసారి ఆలోచించాలంటూ హితవుపలికారు. ఉగ్రవాదులు చనిపోయారన్న సంతోషం వారిలో కనిపించలేదని చెప్పారు. ఉగ్రవాదులు పాక్ నుంచే వచ్చారనేందుకు.. ఆధారాలు ఉన్నాయా అన్న చిదంబరం ప్రశ్నకు అమిత్ షా స్పందించారు. పాక్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారా.. అని ప్రశ్నించారు. పాక్‌కు క్లీన్‌చిట్ ఇవ్వాల్సిన అవసరం ఏంటంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా మాట్లాడటం తగదని హితవు పలికారు. ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి వచ్చారనేందుకు తమ వద్ద ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. ఉగ్రవాదుల నుంచి కొన్ని పాక్ వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నామని అమిత్‌షా క్లారిటీ ఇచ్చారు. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నట్లు- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. పహల్గాం ప్రతీకారాన్ని ధృవీకరించారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని మట్టుబెట్టినట్లు వెల్లడించారు. పహల్గాంలో పర్యాటకులను హత్య చేశారు. టూరిస్టులను ఉగ్రవాదులు అతికిరాతకంగా హత్య చేశారు. కుటుంబ సభ్యులు ముందే కాల్చి చంపారు. మంతం, పేరు అడిగి మరీ చంపడం దారుణం. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని హతమార్చం. ఈనెల 22న శాటిలైట్ ఫోన్ సిగ్నల్ ద్వారా ఉగ్రవాదుల కదలికలను గుర్తించాం. ఆపరేషన్ మహాదేవ్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఉగ్రదాడి జరిగిన రోజునే జమ్ము భద్రతపై సమీక్షించాం. ఉగ్రవాదులను ఆశ్రయం ఇచ్చిన వారిని కూడా అరెస్ట్ చేశాం. ఉగ్రశిబిరాలను మట్టిలో కలిపేశాం. ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, జమ్ము పోలీసులకు అభినందనలు' అని అమిత్ షా తెలిపారు. ఉగ్రవాదుల్ని హతమార్చాం అంటే విపక్షాలు సంతోషిస్తాయనుకున్నానని, కానీ సందేహాలు వ్యక్తం చేస్తున్నారంటూ షా వ్యాఖ్యానించారు. జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ సమీపంలో ఉన్న హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్టు- నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో గడిచిన నెలరోజులుగా ఆ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. లష్కరే, జైషే ఉగ్రవాదుల కదలికల కోసం గడిచిన 14 రోజులుగా మరింత ముమ్మరంగా నిఘాను పెంచాయి. ఈ క్రమంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో రెండు రోజుల కిందట అనుమానస్పద కమ్యూనికేషన్లను భారత సైన్యం పసిగట్టింది. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించిన భద్రతాదళాలు.. మెరుపు వేగంతో కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఉగ్రవాది సులేమాన్ షాతో పాటు- పహల్గాం దాడికి కారణమైన మరో ఉగ్రవాది యాసిర్ హతమైనట్టు- అధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో మరో ఉగ్రవాది అబూ హామ్‌జా కూడా హతమైనట్టు- పేర్కొన్నారు. వీరందరూ విదేశీ ఉగ్రవాదులేనని తెలిపారు. అమాయక పౌరులపై దాడులు చేస్తే మా ప్రతి స్పందన గట్టిగా ఉంటుందని హెచ్చరించారు. విపక్ష ఎంపిల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని, ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో ఒకసారి ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. పహల్గాం దాడి బాధితులను కలిసి వారి బాధలు తెలుసుకున్నామని, పహల్గాం దాడి ఘటనను వెంటనే ఎన్ఐఎకు అప్పగించామని వివరించారు. ఉగ్రవాదులు పాక్ నుంచి వచ్చారనేందుకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, ఉగ్రవాదుల నుంచి పాక్‌లో తయారైన పత్రాలు, చాక్లెట్లు- స్వాధీనం చేసుకున్నామని, కేంద్ర హోంశాఖ మంత్రిగా పని చేసిన వ్యక్తి ఇలా మాట్లాడడం తగదని అమిత్ షా చురకలంటించారు. దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు గమనించి కాంగ్రెస్ నేతలు మాట్లాడాలని సూచించారు. ఆపరేషన్ సింధూర్‌పై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరంగా చెప్పారని, పహల్గాం తీవ్రవాదుల దాడిలో 26 మంది మృతి చెందారని, మృతుల్లో నేపాల్ వ్యక్తి కూడా ఉన్నారని తెలియజేశారు. పహల్గాం దాడి కేవలం పర్యాటకులపై కాదు అని, దేశంపై దాడి పరిగణించాలని, పహల్గాంలో దాడి చేసిన ఉగ్రవాదులను మట్టిలో కలిపేశామని, ఆనాడు 140 కోట్ల మంది ప్రజల గుండెచప్పుడును ప్రధాని మోడీ వివరించారని అమిత్ షా గుర్తు చేశారు. పాక్‌పై దాడులు చేసేందుకు భద్రతాబలగాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, మే 7న ఆపరేషన్ సింధూర్ చేపట్టామని, 9న ఉగ్ర శిబిరాలు ధ్వంసం చేశామని, మన భద్రతా దళాల దాడుల్లో ఒక్క పాక్ పౌరుడు కూడా మరణించలేదన్నారు. పాక్‌లో వందల కిలో మీటర్ల లోపలికి వెళ్లి ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేశామన్నారు. భద్రతా దళాల దాడుల్లో పలువురు ఉగ్రవాద నేతలు కూడా హతమయ్యారని వివరించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ప్రపంచానికి చాటిచెప్పామని, పాకిస్థాన్ దాడుల్లో ఇక్కడి గురుద్వారా, దేవాలయం ధ్వంసమయ్యాయని హోంశాఖ మంత్రి తెలియజేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# ధర్మస్థల ఘటనపై న్యాయ విచారణ చేపట్టి దోషులకు సరైన శిక్షవిధించాలి

**పిడిఎస్‌యు డిమాండ్**

**పత్రిక సమావేశంలో మాట్లాడుతున్న పి.డి.ఎస్.యు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

కాకతీయ యూనివర్సిటీలో పిడిఎస్‌యు ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలోపత్రిక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పి.డి.ఎస్.యు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థల పుణ్యక్షేత్రంలో వెలుగులోకి వచ్చిన ఘటన యావత్ భారత దేశ సమాజాన్ని అతల కుతలం చేస్తుంది అన్నారు. గతంలో అక్కడ స్వచ్ఛతా (పారిశుద్ధ్య) కార్మికుడిగా పనిచేసిన వ్యక్తి స్వయంగా పోలీస్ స్టేషన్కు వెళ్లి 1995 నుండి 2014 మధ్య అనేక మంది మహిళలు, చిన్నారుల మృతదేహాలు అక్కడ బలవంతంగా ఖననం చేయబడ్డాయని ఆ దారుణాలు చూడలేక తను అక్కడ నుండి పారిపోయి దూరంగా ఉన్నానని అయన తిరిగి వచ్చింది జులై 3న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ దారుణ ఘటనలో వంద నుండి మూడువద్దల మంది పైగా హత్యకు గురయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్ని నేరాలు జరిగిన క్రమంలో స్థానిక పోలీసులు ఇతర ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు పసిగట్ట లేకపోయారు అని మానవ హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో విచారణ స్వతంత్రంగా జరగాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. ఇందులో కొంతమంది పైన లైంగికదాడులు జరిగినట్టుగా ఫిర్యాదు చేసిన వ్యక్తి ఆరోపించారు. ఇంత పెద్ద సంఘటన జరిగిన నేపథ్యంలో ఘటనకు కారణమైన వారిని గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాం. నిష్పక్షపాతమైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆధ్వర్యంలో అన్ని కోణాలనూ పరిశీలిస్తూ, బాధితులకు న్యాయం జరగేలా చర్యలు తీసుకోవాలి. ఫోరెన్సిక్ మరియు డీఎన్ఏ పరీక్షలు పూర్తి స్థాయిలో నిర్వహించి, బాధితుల గుర్తింపు కోసం తక్షణ చర్యలు తీసుకోవాలి. ఆ సంఘటనలను దాచిపెట్టేలా ప్రయత్నించిన వ్యవస్థలపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. సనాతన వ్యవస్థల లోపాలను వెలుగులోకి తేవడానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించి దర్యాప్తు జరగాలి. బాధితుల కుటుంబాలకు సరైన న్యాయం, పునరావాసం, ప్రభుత్వ పరంగా మద్దతు లభించేలా ఉండాలని పీ.డీ.ఎస్.యు డిమాండ్ చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి పవన్ నాయకులు ప్రశాంత్,




# ప్రజా ప్రభుత్వం మాటలకే పరిమితమా !

**విద్యార్థులకు లాప్ టాప్‌లు, ఎలక్ట్రిక్ స్కూటర్లు, 5 లక్షల విద్యా భరోసా కార్డులు ఎప్పుడిస్తారు?**

**ప్రభుత్వ విద్యా సంస్థలను అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించాలి**

**ప్రైవేట్ విద్యా సంస్థలకు చట్టాలు, ప్రభుత్వ జీఓలు వర్తించవా?**

**ఫీజు రియంబర్స్మెంట్, గురుకులాల అద్దె బకాయిలు తక్షణమే చెల్లించాలి**

**ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ సభ్యులు కొలుగూరి సూర్య కిరణ్**

**హుజురాబాద్ జై భీమ్ న్యూస్**

ప్రజా ప్రభుత్వం మాటలకే పరిమితం అయ్యిందని ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయ్యిందని ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ సభ్యులు కొలుగూరి సూర్య కిరణ్ అన్నారు. ఈ సందర్భంగా హుజురాబాద్ పట్టణంలో పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజుల పేరిట లక్షల రూపాయలు దోచుకుంటుంటే ప్రభుత్వం, ప్రభుత్వం యంత్రాంగం నిద్రమత్తులో ఉందని మండిపడ్డారు ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని విద్యా సంవత్సరం పూర్తి అయినప్పటికీ ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలో అనేక కళాశాలలో ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు ఎన్నికల హామీలు ఇచ్చిన ఐదు లక్షల విద్యా భరోసా కార్డు మరియు ఎలక్ట్రిక్ స్కూటర్లు లాప్ టాప్ లు ఇంకెప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. గురుకులాల అద్దె బకాయిలు చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి గురుకులాలలో వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలు చూస్తుంటే చాలా బాధగా ఉందని హుజరాబాద్ పట్టణంలో ఉన్న గురుకులాల్లో విద్యార్థులను ఎలుకలు కొరికిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే గురుకులాలలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలానికి ఒక ఇంటర్నేషనల్ మోడల్ స్కూల్ నిర్మిస్తాం అని ఇచ్చిన హామీ ప్రకారం ఒక్క స్కూలు కూడా నిర్మించలేదని ప్రజా ప్రభుత్వం అని చెప్పి పబ్బం గడుపుకుంటుంది తప్ప రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని తక్షణమే విద్యారంగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోహిత్, నవీన్, సందీప్, రాజు, రాజశేఖర్, అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# కేయూలో బోర్డు అఫ్ స్టడీస్ సమావేశం



**జై భీమ్ న్యూస్ కే యూ క్యాంపస్**

కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల్లో డిగ్రీ మొదటి మరియు రెండవ సంవత్సరం విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంనుంచి "ఇంగ్లీష్ ఫర్ బ్రిలియన్స్" మొదటి సంవత్సరం పాఠ్య పుస్తకం ప్రారంభించనుందని విశ్వ విద్యాలయ ఇంగ్లీష్ విభాగం పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు పి. నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రోజు విభాగంలో జరిగిన బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశం లో ఈ అంశాన్ని 20 క్రెడిట్లతో నూతన పాఠ్య ప్రణాళికలో భాగంగా తీసుకురా వాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ కొత్త సిలబస్‌లో గద్య భాగం, కవిత్వం, నటన, నాటకం, వ్యాకరణం, లెర్నింగ్, స్టడీ, రీడింగ్, రైటింగ్ నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన అంశాలు ఉంటాయని వివరించారు. అవసరమైన పాఠ్యపుస్తకాలు వచ్చే వారం రోజుల్లో అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో విభాగాధిపతి డాక్టర్ ఆర్. మేఘనా రావు, బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యులు ప్రొఫెసర్ ఎం. నవీన్, డాక్టర్ రామ్ భాస్కరరాజు, డాక్టర్ శ్రీనాథ్. హైదరాబాదులోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీకి చెందిన ఎక్స్టర్నల్ మెంబెర్ ప్రొఫెసర్ శారద తదితరులు పాల్గొన్నారు.

# భూ వివాదం కేసులో రేవంత్ రెడ్డికి ఊరట

**పెద్దిరాజు తదితరులు వేసిన పిటిషన్ తిరస్కరణ**

**ఫిర్యాదుదారుకు కోర్టు ధిక్కరణ కింద నోటీసులు**

**న్యూఢిల్లీ,జూలై29(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. భూవివాదం కేసులో ఎన్ పెద్దిరాజు వేసిన కేసులో.. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు క్వాష్ చేసింది.అయితే హైకోర్టు ఆదేశాలపై ఎన్ పెద్దిరాజు సుప్రీంకోర్టులో సవాలు వేశారు. ఈ కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ సుప్రీంను ఆశ్రయించారు. ఆ పిటిషన్‌లో హైకోర్టు తీర్పునకు సంబంధించ అంశాలతో పాటూ జడ్జి పైన అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు- సమాచారం. ఎన్ పెద్దిరాజు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. అలాగే ఎన్ పెద్దిరాజుతో పాటు-, ఆయన అడ్వకేట్ రితేష్ పాటిల్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సీజేఐ బీఆర్ గవాయి తదుపరి విచారణకు పిటిషనర్ అండ్ పెద్దిరాజు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించారు. భూ వివాదం వ్యవహారంలో సొసైటీ- స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని 2016లో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మయ్య పై పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పీఎస్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తనపై కేసును కొట్టివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఫిర్యాదు దారు ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. రేవంత్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పు అనంతరం.. కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ పెద్దిరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిష్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం డిస్మిస్ చేసింది.పిటిషన్‌లో.. ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. ఒక న్యాయవాదిగా న్యాయమూర్తిపై వ్యాఖ్యలు చేస్తూ .. పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్.పెద్దిరాజుతోపాటు- ఆయన తరఫు న్యాయవాది రితేష్ పాటిల్‌కు ధర్మాసనం కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు పిటిషనర్ పెద్దిరాజు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలిచ్చింది. కోర్టు సాక్షిగా పిటిషనర్ తరఫు న్యాయవాది రితీష్ పాటిల్ క్షమాపణ కోరారు. అందుకు నిరాకరించిన సీజేఐ.. పిటిషన్ రాసేటప్పుడు, దాఖలు చేసేటప్పుడు గుడ్డిగా ఎలా వేశారని ప్రశ్నించారు. పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అనుమతివ్వాలని న్యాయవాది రితీష్ పాటిల్ కోరగా.. అందుకు సీజేఐ నిరాకరించారు. పిటిషన్ దాఖలు చేసే ముందు న్యాయవాదిగా అన్ని విషయాలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోవద్దంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. కోర్టు ధిక్కరణ నోటీసుపై లిఖిత పూర్వకంగా సమాధానం ఆదేశించారు. సమాధానం ఆమోదయోగ్యంగా ఉంటేనే కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టం చేస్తూ... విచారణ ఆగస్టు 11కు వాయిదా వేశారు.

## గురుకుల పాఠశాలల్లో రాజకీయాలు తగవు

**యువజన కాంగ్రెస్ నాయకులు టేకుల శ్రావణ్**

**కరీంనగర్ జిల్లా (హుజురాబాద్) జై భీమ్ న్యూస్**



హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి నిత్యం పత్రికల్లో ప్రసార మధ్యమాల్లో, సోషల్ మీడియాలో కనిపించడం కోసం తనకు నచ్చినట్లు మాట్లాడుతున్నారని యువజన కాంగ్రెస్ నాయకులు టేకుల శ్రావణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిత్యం కాంగ్రెస్ పార్టీని బదనాం చేయడమే టార్గెట్ గా పెట్టుకుని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన నోటికి వచ్చినట్లు అద్దు అదుపు లేకుండా మాట్లాడుతున్నారని ఆయన తీరు చూస్తుంటే హుజురాబాద్ ప్రజలు తలదించుకునే పరిస్థితి ఏర్పడిందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కౌశిక్ రెడ్డి లాంటి వ్యక్తి విమర్శించడం తగదని కాంగ్రెస్ పార్టీకి బిఆర్ఎస్ పార్టీకి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని పది సంవత్సరాలు అధికారంలో ఉండి చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలల్లో చేసి చూపించిందని కెసిఆర్ కేటీఆర్ మెప్పుకోసం మరియు ఏదో ఒకటి మాట్లాడి నిత్యం వార్తల్లో ఉండాలని కౌశిక్ రెడ్డి పిచ్చిపిచ్చిగా నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నాడని నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలను మభ్యపెట్టి బ్లాక్ మెయిల్ చేసి చస్తానని గెలిచిన కౌశిక్ రెడ్డి అవాకులు చేవాకులు పేలితే చూస్తూ ఊరుకోమని తగిన విధంగా బుద్ధి చెబుతామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గురుకుల పాఠశాల వసతులలో మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం డైట్ మరియు కాస్మోటిక్ చార్జీలు పెంచడమే కాకుండా గత బిఆరెస్ ప్రభుత్వం కంటే అదునాతన సౌకర్యాలు అందిస్తుంటే అది చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్నవని ప్రభుత్వం పట్ల లేని పోనీ నిందలు వేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## పరకాల పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

**ప్రజల సహకారంతోనే పరకాల పట్టణ అభివృద్ధి సాధ్యం, గత పాలకుల వైఖరి వల్ల నిరాధారణకు గురైంది**

**మహిళలను కోటీశ్వరులు చేయడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది**

**పరకాల మున్సిపాలిటీ పరిధిలో జెసిబి మరియు స్వచ ఆటోలను ప్రారంభించిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**హన్మకొండ జిల్లా (పరకాల) జై భీమ్ న్యూస్**





పరకాల పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణం నందు ఒక జెసిబి, 6 స్వచ ఆటోలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ స్టాల్స్ ను అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన మరియు అమ్మకాల సందర్శన స్టాల్ ను పరిశీలించారు.అంతకముందు వనమహోత్సవంలో భాగంగా అధికారులతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం మున్సిపల్ కార్మిక సిబ్బందికి బట్టలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందాల్సిన పరకాల గత పాలకుల వైఖరి వల్ల నిరాధారణకు గురైంది అని అన్నారు. పరకాల పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కృషి చేస్తున్నానన్నారు. పరకాలలో స్కిల్ డెవలప్మెంట్ ఏర్పాటు చేయబోతున్నామని, త్వరలో సెట్విన్ రాబోతుందని అన్నారు. టియుఎఫ్ఐడిసి నిధులతో డిపిఆర్ ద్వారా అభివృద్ధి చేస్తున్నామన్నారు. త్వరలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే నలభై కోట్లతో డ్రైనేజీ, దాదాపు 11 కోట్లతో రోడ్ల అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజల సహకారంతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలు పరిశుభ్రత పాటించి పారిశుద్ధ్యంను పరిష్కరించడంలో భాగస్వాములు కావాలన్నారు. పరకాలకు పూర్వ వైభవం తీసుకురావడంలో ప్రజలు సహకరించాలని అన్నారు. గత పాలకుల మోసపూరిత మాటలతో పరకాల పట్టణం. వెనుకబడిందన్నారు.మహిళలను కోటీశ్వరులు చేయడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నివాస గృహాలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు సరఫరా, రైతు భరోసా, 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ, యువతకు రాజీవ్ యువ వికాసం, మహిళలకు వడ్డీ లేని రుణాలను, ఇతర సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

## మూడోరోజు బిజీగా సిఎం సింగపూర్ పర్యటన

**అమరావతి,జూలై29(జై భీమ్ న్యూస్):**

నగరాభివృద్ధి, వాణిజ్య సదుపాయాలు, మౌలిక వసతుల రంగాల్లో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన సింగపూర్‌కు చెందిన కెప్పెల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లిమ్ యాంగ్ వియ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. సింగపూర్ లో మూడో రోజు పర్యటనలో భాగంగా సీఎం వివిధ పారిశ్రామిక దిగ్గజ కంపెనీలతో బేటీ అయ్యారు. అమరావతి నగర అభివృద్ధిలో కెప్పెల్ భాగస్వామ్యంపై ప్రధానంగా ఇరువురి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రాభివృద్ధి కోసం విశాఖను గ్రోత్ ఇంజిన్‌గా మార్చే లక్ష్యంతో ఐటీ-, వాణిజ్యం, గృహ నిర్మాణ రంగాల్లో ప్రాజెక్టుల అభివృద్ధికి కెప్పెల్‌ను ఆహ్వానించారు. అమరావతి నగర అభివృద్ధి, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, పరిశ్రమల రంగం అభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టు-బడులకు ఉన్న అవకాశాలపై గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్ట్ మెంట్ కార్పోరేషన్ (జీఐసీ) సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ బ్రాన్ యోతోనూ ముఖ్యమంత్రి భేటీ- అయ్యారు. జీఐసీతో దీర్ఘకాలిక భాగస్వామ్యం, స్థిరమైన పెట్టుబడులపై ప్రణాళికల రూపకల్పనపై చర్చించారు. వైద్య, విద్య, పట్టణ ప్రణాళిక, పౌర సదుపాయాలు వంటి రంగాల్లో జీఐసీ పెట్టు-బడులు పెట్టేలా అనువైన వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆయా రంగాల్లో ఆంధ్రప్రదేశ్ అపారమైన అవకాశాలు ఉన్నాయని సీఎం స్పష్టం చేశారు.

# జాతీయ విద్యా విధానం 2020 అమలుపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే నాగరాజు





**పీఎం శ్రీలో ఉత్తమ పాఠశాలగా హసన్పర్తి బాలికల పాఠశాల ఎన్నికవ్వడం చాలా సంతోషకరం...**
**పీఎం శ్రీ జాతీయ విద్యా విధానం- 2020 5వ వార్షికోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాగరాజు**
**పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించారు....**
**బాక్సింగ్ పోటీలో బ్రాండ్ మెడల్ సాధించిన విద్యార్థి వైష్ణవి నీ శాలువాతో సత్కరించి అభినందించిన ఎమ్మెల్యే నాగరాజు**

జై భీమ్ న్యూస్ హన్మకొండ

భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం-2020 విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు బాటలు వేస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే శ్రీ కెఆర్ నాగరాజు అన్నారు. పిఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హసన్ పర్తి లో ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఎన్నంశెట్టి సుమాదేవి అధ్యక్షతన జరిగిన జాతీయ విద్యా విధానం- 2020 5వ వార్షికోత్సవ సమావేశంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, నైపుణ్యపరంగా మెరుగులు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యను మలచడమే ఈ విద్యా విధానం ముఖ్య లక్షణం అని తాను దత్తత తీసుకున్న ఈ పాఠశాల పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల పాఠశాల హసన్ పర్తి జిల్లాలోనే అత్యుత్తమ పి యం శ్రీ పాఠశాలకు ఎంపిక కావడం తనకు చాలా గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్ ,అటల్ టింకరింగ్ ల్యాబ్ లను పరిశీలించారు. పాఠశాలల్లోని కంప్యూటర్ ల్యాబ్ కి ఫాల్ సీలింగ్, ఏసీల ఏర్పాటు మరియు పాఠశాల డయాస్ పైకప్పు ఏర్పాటు అతి త్వరలో చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు ఇన్ని సౌకర్యాలు ఉన్న ఈ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని కోరారు.. గత పాలకుల నిర్లక్ష్యంతో విద్య వ్యవస్థ మొత్తం వెనుకబడ్డ పడిపోయింది అని నేడు మన ప్రజా ప్రభుత్వం లో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్య వ్యవస్థను గాడిలో పెడుతూ ఎక్కడ లేని నూతన టెక్నాలజీ తో విద్యను అందించాలనే సంకల్పంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రతి నియోజకవర్గానికి 200 కోట్ల రూపాయలతో మంజూరు చేసిన విషయం అందరికీ తెలిసిందే. విద్య పట్ల మక్కువ స్పోర్ట్స్ స్కూల్ కూడా మంజూరు చేశారని మీ ఆగస్టు 15వ తేదీ దాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు అన్నారు. అనంతరం అండర్ 14 బాక్సింగ్ పోటీలో బ్రాండ్ మెడల్ సాధించిన విద్యార్థి వైష్ణవి నీ శాలువాతో సత్కరించి అభినందించిన ఎమ్మెల్యే నాగరాజు. తదనంతరం పాఠశాల విద్యార్థి విద్యార్థినీలకు భోజనం తయారు ని పరిశీలించి నాణ్యమైన ఫుడ్ను అందించాలని వారికి పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ ఎ. శ్రీనివాసరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి ఎస్ రజిత, మండల సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.చేరాలు, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కె. కిరణ్, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు టీ.తిరుపతి, మాజీ జడ్పిటిసి శ్రీ వింజమూరి వెంకటేశ్వర్లు, పెద్దమ్మ నరసింహారాములు, వీసం సురేందర్ రెడ్డి మరియు ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు..

## తప్పుడు కాగితాలు సృష్టించిన వ్యక్తిపై కేసు నమోదు

ఐనవోలు : (జై భీమ్ న్యూస్)



తప్పుడు కాగితాలు సృష్టించి,సంతకాలు ఫోర్జరీ చేసి భూమి ఆక్రమానికి ప్రయత్నించిన వ్యక్తి పైన ఐనవోలు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఐనవోలు పోలీసు వారు.ఎస్సై పస్తం శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ఐనవోలు మండలంలోని నందనం గ్రామ వాస్తవ్యుడు గజ్జెల్లి శ్రీరాములు తండ్రి కొమురయ్య నందనం గ్రామ శివారులో సర్వేనెంబర్ 86 గతంలో బుర్ర మాధవి అనే వ్యక్తి సానం మల్లేశం పేరు మీద ఉన్న భూమిని కొనుగోలు చేశారు.ఆ భూమి పై గజ్జెల్లి శ్రీరాములు కన్నుపడి సానం మల్లేశం చనిపోయిన తర్వాత తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి అతని వేలిముద్ర సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు,సాక్షులతో బలవంతంగా సంతకాలు చేయించి,కాగితాలు సృష్టించి భూమిని ఆక్రమించుకోవడానికి కోర్టులో సివిల్ కేసు ఫైల్ చేసి,మళ్లీ తానే తన తప్పునీ ఒప్పుకొని,ఆ సివిల్ కేసును గత సంవత్సరం రాజీపడినాడు.మళ్లీ వేరే చోట తనకు 03 గుంటల భూమి ఇవ్వాలని లేదంటే గతంలో తను అక్రమించదలచిన భూమిని మళ్ళీ కబ్జా చేస్తానని బుర్ర మాధవిని బ్లాక్ మెయిల్ చేసి తనను భయభ్రాంతులకు గురి చేయగా, బుర్ర మాధవి ఇచ్చిన దరఖాస్తు మేరకు గజ్జెల్లి శ్రీరాములు పై ఫోర్జరీ (468 ఐపీసి), చీటింగ్ (420)కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఒక ప్రకటనలో ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

## సైన్యం చేతులు కట్టేసి..పాక్‌తో సయోధ్య

**ఉగ్రదాడులకు దీటుగా సమాధానం చెప్పడంలో విఫలం**
**దమ్ముంటే ట్రంప్ వ్యాఖ్యలను ఖండించాలి**
**ఆపరేషన్ సిందూర్ చర్చపై రాహుల్**

న్యూఢిల్లీ,జూలై29(జై భీమ్ న్యూస్):

ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైనికుల చేతులు కట్టేశారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. సాయుధ దళాలకు మద్దతుగా నిలిచే విషయంలో ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం కొరవడిందని విమర్శించారు. తాము యుద్ధం కోరుకోవడం లేదని పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వమే తెలియజేసిందన్నారు. 'ఆపరేషన్ సిందూర్ 'పై చర్చ సందర్భంగా లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. పహల్గాం ఉగ్రదాడిని పాకిస్థాన్ కుట్రపన్నిన క్రూరమైన ఘటనగా పేర్కొన్నారు. సాయుధ దళాలను ఉపయోగించాలనుకుంటే.. బలమైన రాజకీయ సంకల్పం ఉండాలి. వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. కానీ.. ఆపరేషన్ సిందూర్ విషయంలో మన సైనికుల చేతులు కట్టేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన సున్నితమైన వివరాలను దాయాదికి వెల్లడించారు. అర్ధరాత్రి 1.05 గంటలకు ఆపరేషన్ ప్రారంభమైందని.. 1.35కు పాకిస్థాన్‌కు ఫోన్ చేసి సైనికేతర లక్ష్యాలను ఛేదించామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారన్నారు. ఉద్రిక్తతలు పెంచే ఆలోచన లేదని దాయాదితో చెప్పామన్నారు. అంటే.. పాక్‌తో యుద్ధం చేసే ఆలోచన లేదని ఆయన చెప్పకనే చెప్పారని రాహుల్ గాంధీ విమర్శించారు. పాక్ విజ్ఞప్తి మేరకు యుద్ధాన్ని ఆపామని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు.. భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటివరకు 29 సార్లు చెప్పుకొన్నారు. ఇందిరా గాంధీలా ధైర్యం ఉంటే.. ట్రంప్ 'అబద్ధాలకోరు' అని, భారత్ యుద్ధవిమానాలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని ప్రధాని మోదీ లోక్‌సభలో ప్రకటించాలని రాహుల్ డిమాండ్ చేశారు. 'ఆపరేషన్ సిందూర్'కు ముందు అన్ని పార్టీలు ఏకతాటిపై నిలిచాయని, తాను పహల్గాం దాడి బాధిత కుటుంబాలను పరామర్శించినట్లు- తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అమానుషమని, ఈ దాడి అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ప్రభుత్వానికి మద్దుతు తెలిపాయని, ఇందుకు తాము గర్విస్తున్నామని రాహుల్ గాంధీ అన్నారు.హహల్గాం ఉగ్రదాడిలో పర్యాటకులను అత్యంత కిరాతకంగా కాల్చి చంపారని రాహుల్ అన్నారు.

## రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ 31 వ తేదీ నుండి ప్రారంభం

**పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

జై భీమ్ న్యూస్ హన్మకొండ



వరంగల్ కమిషనరేట్ పోలీసుల అధ్వర్యంలో ఈ నెల 31వ తేది నుండి మూడురోజుల పాటు తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ 2025 నిర్వహిస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రకటించారు. మామునూర్ పి.టి.సి వేదికగా నిర్వహిస్తున్న ఈ రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లకు తెలంగాణ రాష్ట్రంలోని ఏడు పోలీస్ చేందిన జోన్లతో పాటు సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్లు, సిఐడి ఇంతెలిజెన్స్,యాంటీ నార్కోటిక్ బ్యూరో,సైబర్ సెక్యూరిటీ వింగ్ విభాగాలకు చెందిన సూమారు వెయ్యికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది సైటిఫిక్ ఎయిడ్, యాంటీ సబటేజ్ చెక్,కంప్యూటర్,డాగ్ స్కాడ్, ప్రొపెషనల్ ఫోటోగ్రాఫీ, వీడియో గ్రఫీలకు సంబంధించిన 25 విభాగాల్లో పోటీ పడుతారు. ఈ పోటీలను 31తేదిన ఉదయం 9గంటలకు రాష్ట్ర స్థాయి పోలీస్ ఉన్నతాధికారి చేతుల మీదుగా ఈ రాష్ట్ర స్థాయి డ్యూటీ పోటీలను ప్రారంభించబడుతుందని. అలగే ఆగస్టు 2వ తేదిన ఈ పోటీల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు ముఖ్య అతిధిల చేతుల మీదుల విజేతలకు పతకాలను అందజేయడంతో పాటు, ఛాంపియన్ షీప్ ట్రోఫీలను అందజేయడం జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

## కాశ్మీర్‌లో సాధారణ పరిస్థితి ఉందని ఎలా చెబుతారు

న్యూఢిల్లీ,జూలై29(జై భీమ్ న్యూస్):

జమ్మూకశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని కేంద్రం చెబుతుండటంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. అంతా సజావుగానే ఉంటే, శాంతి భద్రతలు నెలకొని ఉంటే పహల్గాం ఉగ్రదాడి ఎలా జరిగిందని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై లోక్‌సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో ప్రియాంక గాంధీ మాట్లాడారు. భారత సాయుధ బలగాల సేవలు, త్యాగాలను ప్రశంసించారు. జాతీయ భద్రతపై చెక్కుచెదరని వారి సంకల్పాన్ని కొనియాడారు. పహల్గాంలో పర్యాటకులను దారుణంగా చంపారని, వివరాలు అడిగి మరీ చంపారని ప్రియాంక ఆవేదన వ్యక్తం చేశారు. భార్య కళ్లముందే శుభమ్ అనే వ్యక్తిని చంపేశారని అన్నారు. పహల్గాంలో పర్యాటకుల దగ్గర భద్రతా సిబ్బంది ఎందుకు లేరని సూటిగా ప్రశ్నించారు. పర్యాటకుల భద్రత కేంద్ర ప్రభుత్వానిది కాదా? అంటూ నిలదీశారు. ఇది నిఘా సంస్థల వైఫల్యం కాదా? అని ధ్వజమెత్తారు.పహల్గాం ఉగ్రదాడి బాధ్యత ఎవరిది? ప్రధాన మంత్రిదా? హోం మంత్రిదా? రక్షణ మంత్రిదా? నేషనల్ సెక్యూరిటీ- అడ్వయిజర్‌దా? ఎవరైనా రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. జాతీయ భద్రత విషయంలో తీవ్రలోపం జరిగిందన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించామని అమిత్‌షా చెబుతున్నారని, అయితే కశ్మీర్‌లో గతంలోనూ టీఎఆర్‌ఎఫ్ దాడులు చేసిందని గుర్తు చేశారు. టీఆర్‌ఎఫ్ వరుస దాడులు చేస్తుంటే కేంద్రం ఏం చేస్తోందన్నారు. రక్షణమంత్రి గంటసేపు సభలో చాలా విషయాలు మాట్లాడారని, కానీ ఒక పాయింట్ ప్రస్తావించలేదన్నారు. ఏప్రిల్ 12న పట్టపగలే ఉగ్రదాడి ఎలా, ఎందుకు జరిగిందో చెప్పలేదన్నారు. 2008 బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్‌లో టెర్రరిస్టులను చంపినందుకు సోనియా గాంధీ కంటతడిపెట్టారంటూ హోంమంత్రి అమిత్‌షా ఆరోపించడాన్ని ప్రియాంక గాంధీ తిప్పికొట్టారు.

## కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎన్‌సిసి క్యాంప్‌లో ఆరో రోజు శిక్షణ విజయవంతం




జై భీమ్ న్యూస్ కే యూ క్యాంపస్

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎన్ సి సీ. పదవ తెలంగాణ బటాలియన్, వరంగల్ గ్రూప్ ఆధ్వర్యంలో జరుగుతున్న కంబైండ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్-6 ఆరో రోజు శిక్షణ కార్యక్రమాలు శ్రమతో కూడినవిగా కొనసాగాయి. ఈ క్యాంప్‌ను కమాండెంట్ కల్నల్ ఎస్.ఎస్. రామదురై పర్యవేక్షిస్తున్నారు. ఈరోజు ఉదయం యోగాసనాలు, ఫిజికల్ ఫిట్నెస్, ప్రత్యేక డ్రిల్ శిక్షణలు నిర్వహించబడినట్టు తెలిపారు. అంతేకాక, రిపబ్లిక్ డే - 2026 ఢిల్లీ పరేడ్‌లో పాల్గొనబోయే వరంగల్ గ్రూప్ క్యాడెట్లు ఎంపిక ప్రక్రియ ఈరోజుతో పూర్తి చేయబడిందని, ఇది లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారి ఆధ్వర్యంలో జరిగిందని కల్నల్ రామదురై వెల్లడించారు. క్యాడెట్ల ఉత్సాహం, ఉల్లాసం కోసం సాయంత్రం వాలీబాల్, కోకో పోటీలు నిర్వహించగా, విజేతలకు చివరి రోజు బహుమతులు అందించనున్నారు. క్యాంప్ సమయంలో క్యాడెట్లకు కఠినమైన శిక్షణ అందిస్తున్నట్లు క్యాంప్ కమాండెంట్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ అడ్జుటెంట్ లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారి, కెప్టెన్ డా. పి. సతీష్, కెప్టెన్ డా. ఎం. సదానందం, సుబేదార్ మేజర్ జై రామ్ సింగ్, రవీందర్, సౌరస్య, అజిత్ కదం, సందీప్, క్వార్టర్ మాస్టర్ సుతారి, సందీప్ పవార్, దీపక్, సంతోష్, లెఫ్టినెంట్ గణేష్, రాధాకృష్ణ, రాజమాణిక్యం, జీవన్, భవాని, సంధ్య, కళ్యాణి, సూపరింటెండెంట్ అరుణ, కుమారస్వామి, దత్తు, సతీష్, మహేష్, మరియు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్సిటీ మైనారిటీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మైనార్టీ ఉద్యోగస్తులకు సన్మానం




జై భీమ్ న్యూస్ కే యూ క్యాంపస్

ఇటివల ఉద్యోగ విరమణ, పదోన్నతి, డాక్టరేట్ పొందిన ఉద్యోగులను సన్మానించిన విశ్వవిద్యాలయ మైనారిటీ ఉద్యోగ సంఘ బాధ్యులు డాక్టర్ మహమ్మద్ అసిం ఇక్బాల్, జనరల్ సెక్రటరీ మహమ్మద్ అజాం ఒక ప్రకటనలో తెలిపారు, ఇటివల డిప్యూటీ రిజిస్ట్రార్ గా పదోన్నతి పొందిన మహమ్మద్ హబీబిద్దిన్, ఉద్యోగ సంఘ ఎన్నికల లో విజయం సాదించిన మహమ్మద్ యూనిస్, మొహమ్మద్ వలిపాష, ఉద్యోగ విరమణ చేసిన మహమ్మద్ శుఖుర్, మహమ్మద్ సిరాజుద్దీన్ ను శాలువా, జ్ఞాపిక తో సన్మానించారు, ఈ కార్యక్రమం లో డాక్టర్ కనీజ్ ఫాతిమా, విశ్రాంత ఆచార్యులు ఆచార్య మహమ్మద్ ముస్తఫా, ఘోసియా బేగం, మహమ్మద్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

## కుల్పా అధ్యక్షునిగా డా ఏ నాగేశ్వర రావు ఎన్నిక

జై భీమ్ న్యూస్ కే యూ క్యాంపస్



కే యు లైబ్రరీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ కు అధ్యక్షునిగా డాక్టర్ ఏ నాగేశ్వర్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సాయంత్రం ప్రధాన కార్య దర్శి వి కృష్ణమా చార్య అధ్యక్షతన జరిగిన కుల్పా సర్వ సభ్య సమావేశంలో ఆయనను అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుత అధ్యక్షులు పి కొండల్ రెడ్డి మరణించడంతో అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు డా. రంగనాథన్ జయంతి సందర్భంగా నిర్వహించే గ్రంథపాలకుల దినోత్సవం 12 ఆగస్ట్ 2025 నాడు లో అత్యధిక మార్కులు పొడిన విద్యార్థికి బంగారు పతకం, ఉత్తమ లైబ్రేరియన్ పురస్కారం తో పాటు ఉత్తమ చదువరికి మేమెంటో అంద చేసేందుకు తీర్మానించారు. సమావేశం లో కోశాధికారి ఎం మనోహర్ రావు, ప్రో కే రమణయ్య, ఎం కోటేశ్వర్ రావు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

# ప్రభుత్వ ఖజానాకు నష్టం చేస్తూ బోగస్ వాహన రిజిస్ట్రేషన్, ఇన్సురెన్స్ సర్టిఫికేట్ల తయారీ ముఠా అరెస్టు







**జై భీమ్ న్యూస్ హన్మకొండ**

రెండు వేర్వేరు సంఘటనల్లో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిస్తూ బోగస్ వాహన రిజిస్ట్రేషన్, ఇన్సురెన్స్ సర్టిఫికేట్లను తయారీ చేసున్న రెండు ముఠాలకు సంబంధించి 15 మందిని కేటుగాళ్ళను టాస్క్ ఫోర్స్, హన్మకొండ, మీల్స్ కాలనీ, కెయూసి పోలీసులు ఆర్.టి.ఏ అధికారులతో సంయుక్తంగా కలిసి అరెస్టు చేయగా మరో ఐదుగురు నిందితులు ప్రస్తుతం పరారీలో వున్నారు. పట్టుబడిన నిందితుల నుండి పోలీసులు 6 డెస్క్ టాప్ కంప్యూటర్లు, 2 ల్యాప్ టాప్లు, 2 థర్మల్ ప్రింటర్స్, 17 సెల్ ఫోన్ల తో పాటు కంప్యూటర్ చిఫ్ తో కూడిన పివిసి కార్డులు, కార్డు ప్రింటింగ్ కు అవసరమైన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో 1. యం.డి ఆసిఫ్ ఖురేషి (46), హన్మకొండ, 2. వడ్లకొండ శ్రీనివాస్(46) హన్మకొండ, 3. యం.డి నవాబ్ (60), లెబర్ కాలనీ, వరంగల్, 4. యం.డి సాబీర్ (44), ఎల్.బి నగర్, 5. మణికంటి ప్రభాకర్ రెడ్డి(50), నయీంనగర్, హన్మకొండ, 6. గుగ్గిళ్ళ చెర్రిబాబు (50), కాపువాడ, హన్మకొండ, 7. కెషోజు రాజ్కుమార్ అలియాస్ డి.ఎల్ రాజు (49), గుడిబండల్, హన్మకొండ, 8. యం.డి ఆసిఫ్ (29), కరుణాపురం, ధర్మసాగర్, 9. అంకం శ్రీనివాస్ (50), ధర్మసాగర్, 10. గౌనెల రమేష్ అలియాస్ వాగ్దేవి రమేష్ (41), సుధానగర్, హన్మకొండ, 11. ఎన్. శశివర్ధన్(31), ఫోర్టు వరంగల్, వరంగల్, 12. నరిశెట్టి రాజేష్ (37), కరీమాబాద్, వరంగల్, 13.తండ దిలివ్ కుమార్ (29), శాయంపేట హవేలి, గీసుగొండ, 14. ముజ్జిగ ఓంప్రకాశ్ (31), నక్కలపెల్లి, వరంగల్, 15. ముషిపట్ల అక్షయ్ కుమార్ (29), ఫాతీమానగర్, కాజీపేటకు చెందిన వారిగా గుర్తించడం జరిగింది. ప్రస్తుతం పరారీలో వున్న నిందితులు లక్ష్మమ్మ, సతీష్, వేల్పుల ప్రశాంత్, దేవులపల్లి శ్రావణ్, మామిడి రాజు ఏ భూపాలపల్లి రాజు వున్నారు. పట్టుబడిన నిందితుల్లో అధికశాతం ఆర్.టి.ఓ బ్రోకర్లు మరియు వాహన కన్సల్టెన్సీ యజమానులు వున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా వివరాలను వెల్లడిస్తూ. ఈ రెండు కేసులకు సంబంధించి హన్మకొండ పోలీసులు అరెస్టు చేసిన ఇద్దరు ప్రధాన నిందితులైన ఎమ్.డి. ఆసిఫ్ ఖురేషి, వడ్లకొండ శ్రీనివాస్ లు ఆర్.టి.ఏ ఏజెంట్లుగా చెలామణి అవుతున్నారు. ఫైనాన్స్ ద్వారా వాహనాలు కొనుగోలు చేసిన వాటి వాయిదాలు తిరిగి చెల్లించని పక్షంలో ఫైనాన్స్ సంస్థలు స్వాదీనం చేసుకున్న వాహనాలను సదరు వాహన ఫైనాన్స్ సంస్థలు తిరిగి విక్రయించే సమయంలో తప్పనిసరిగా ప్రేష్ రిజిస్ట్రేషన్ కార్డు కొసం ఆర్.టి.ఓ కార్యాలయానికి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది. కాని వాహన ఫైనాన్స్ సంస్థలు అలా చేయకుండా స్వాధీనం చేసుకున్న వాహనాలను నేరుగా స్థానికంగా వున్న వాహన కన్సల్టెన్సీ వ్యాపారస్తులకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లతో పాటు ఓరిజినల్ వాహన రిజిస్ట్రేన్ కార్డు లేకుండా వాహనాన్ని విక్రయించేవారు. దీనితో వాహన కన్సల్టెన్సీ వ్యాపారస్తులు వాహనాలను విక్రయించేందుకుగాను అవసరమైన ఒరిజినల్ రిజిస్ట్రేషన్ పత్రాల కొసం ప్రధాన నిందితులను సంప్రదించేవారు. దీనితో నిందితులు కన్సల్టెన్సీ ద్వారా విక్రయించే వాహనాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్లైన్ ద్వారా సేకరించి, ఆన్లైన్ లో కొనుగొలు చేసిన పి.వి.సి. కార్డ్ లపై మరియు ఆర్.టి.ఓ కార్యాలయముల నుండి అక్రమంగా వివిధ మార్గాల్లో సేకరించిన ఓరిజినల్ కార్డులపై థర్మల్ ప్రింటింగ్ మిషన్ ద్వారా ఒరిజినల్ తరహాలో రిజిస్ట్రేషన్ కార్డులను తయారు చేసి కన్సల్టెస్టీ వ్యాపారస్తులకు అందించడంతో కన్సల్టెన్సీ వ్యాపారస్తులు వాహన ఫైనాన్స్ సంస్థల నుండి కొనుగొలు వాహనాలను ప్రజలకు విక్రయిస్తూ బోగస్ రిజిస్ట్రేషన్ పత్రాలను ఉపయోగించి ఆన్లైన్ లో ఫ్రెష్ రిజిస్ట్రేషన్ లను ఆర్.టి.ఏ నుండి జారీ చేయిస్తున్నారు. మరో సంఘటనలో కె.యూ.సి మరియు మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు అరెస్టు చేసిన నిందితులందురు ఆర్.టి.ఏ బ్రోకర్లుగా పనిచేస్తూ ఫిట్నెస్ సర్టిఫికేట్ రెన్యూవల్ అవసరం ఉన్న వాహనాలకు మరియు ఓనర్ షిప్ ట్రాన్స్ఫర్ సమయంలో ఆర్.టి.ఏ నిబంధనల ప్రకారం వాహన భీమ పత్రాలు తప్పనిసరి కావున దానిని ఆసరాగా చేసుకొని, అవసరమైన భీమా పత్రాల కొసం ఈ ముఠా సభ్యులు ముందుగా ఒక ఓరిజినల్ భీమా పాలసీని తీసుకొని, వారికి వున్న పరిజ్ఞానంతో పాలసీపై ఉన్న వివరాలను మార్చి వాటి స్థానంలో వారికి కావల్సిన వాహన వివరాలు, కావాల్సిన పాలసీ గడువు తేదీలతో కూడిన బోగస్ వాహన పాలసీలను రూపోందించేవారు. ఈ విధంగా రూపొందించిన భీమా పత్రాలను ఆర్.టి.ఓ కార్యాలయానికి ఆన్లైన్లో దరఖాస్తు చేసి ఫిటెనెస్ రెన్యూవల్ సర్టిఫికెట్ పొందే విధంగా నిందితులు వాహనదారులకు సహకరిస్తూ వారి వద్ద నిందితులు పెద్ద మొత్తంలో డబ్బు వసూళ్ళుకు పాల్పడేవారు. రెండు వేర్వురు సంఘటనల్లో హన్మకొండ పోలీసులు ఆరుగురుని అరెస్టు చేయగా, మీల్స్ కాలనీ పోలీసులు ఆరుగురుని, కెయూసి పోలీసులు మరో ముగ్గురుని అరెస్టు చేసారు. ఈ రెండు సంఘటనల్లో నిందితులు బోగస్ రిజిస్ట్రేషన్ కార్డ్స్, బోగస్ భీమా పత్రాలను అందజేయడం ద్వారా పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగింది. అలాగే ఆర్.టి.ఓ విభాగానికి సంబంధించి ఎవరైన ఉద్యోగులు నిందితులకు సహకరించానే కోణంపై పోలీసులు విచారణ జరుపుతున్నట్లుగా సెంట్రల్ జోన్ డిసిపి వెల్లడించారు. నిందితులను పట్టుకొవడంలో ప్రతిభ కనబరిచన వరంగల్ ఏసిపి శుభంప్రకాశ్, హన్మకొండ ఏసిపి నర్సింహరావు, టాస్క్ఫోర్స్ ఏసిపి మధుసూధన్, ఇన్స్పెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, శ్రీధర్, బాబులాల్, పవన్ కుమార్ మరియు కెయూసి, మిల్స్ కాలనీ, హన్మకొండ ఇన్స్పెక్టర్లు రవికుమార్, రమేష్, శివకుమార్ తో పాటు, టాస్క్ఫోర్స్, కెయూసి, మిల్స్ కాలనీ, హన్మకొండ పోలీస్ స్టేషన్లకు చెందిన ఎస్.ఐలు, ఇతర పోలీస్ సిబ్బందిని సెంట్రల్ జోన్ డిసిపి అభినందించారు.

## టీజీ క్యాబ్ 86 పాలకవర్గ సమావేశంలో పాల్గొన్న మార్నెనీ రవీందర్ రావు





**జై భీమ్ న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ 86వ పాలకవర్గ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నెనీ రవీందర్ రావు ఈ సందర్భంగా వారు ఆర్థిక లావాదేవీలపై,టర్నోవర్స్, జిల్లాలోని డిసిసిబి బ్యాంకుల పని తీరు మరియు పురోగతి పై, ఐటి రంగం, నెట్ వర్క్ పై, డిపాజిట్స్ ఎడ్యుకేషనల్ అవర్నెస్, ఆర్బీఐ మరియు నాబార్డ్ సర్కులర్ల అమలుపై,వ్యవసాయ రుణాలు,రైతు రుణ మాఫీపై వారు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులైన కరీంనగర్ డిసిసిబి చైర్మన్ కొండూరు రవీందర్ రావు,మెదక్ డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి,నల్గొండ డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి,నిజామాబాద్ డిసిసిబి చైర్మన్ కుంట రమేష్ రెడ్డి,మహబూబ్ నగర్ డిసిసిబి చైర్మన్ మామిల్లపల్లి విష్ణు వర్ధన్ రెడ్డి,ఖమ్మం డిసిసిబి చైర్మన్ దొండపాటి వేంకటేశ్వర రావు,ఆదిలాబాద్ డిసిసిబి చైర్మన్ అడ్డి బోజా రెడ్డి,ప్రొఫెషనల్ డైరక్టర్లు మెహనయ్య, ఆడిషనల్ రిజిస్ట్రార్ శ్రీనివాస రావు,నాబార్డ్ సిజిఎం ఉదయ్ భాస్కర్ ,టేస్కాబ్ ఎండీ వై కృష్ణా రావు, మరియు బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు..

## అశేష భక్తజనంతో భద్రకాళి అమ్మవారికి చీర, సార సమర్పణ





**వరంగల్ జై భీమ్ న్యూస్**

కోరిన కోర్కెలకు కొంగు బంగారమగుచూ తన కరుణారస వీక్షణంతో ఓరుగల్లు ప్రజల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళి అమ్మవారి లక్ష్మిశ్రీనివాస సేవా ట్రస్ట్, మహబూబాబాద్ అధ్యక్షులు బి. కృష్ణా రెడ్డి అధ్వర్యంలో పోచమ్మమైదాన్ రత్నా హెూటల్ నుండి భద్రకాళి దేవస్థానం వరకు మేళతాళాలతో సుమారు 300 మంది భక్తులు ర్యాలీగా విచ్చేసి శ్రీ భద్రకాళి అమ్మవారికి చీర, సారతో పాటు 51 రకాల స్వీట్లు వివిధ రకాల పండ్లు సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని దేవస్థానం చైర్మన్ డా. బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోతుకూరి మయూరి రాము, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగుల ఆంజనేయులు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాసరావు, ఈఓ శేషుభారతి ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు తదితరులు ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి భట్టి శ్రీనివాస్ భార్గవి దంపతులు, కార్పోరేటర్లు చాడ స్వాతిరెడ్డి, దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, శ్రీ లక్ష్మిశ్రీనివాస సేవాసమితి కార్యదర్శి ప్రేమలత, వైస్ ప్రెసిడెంట్ నాగజ్యోతి, సభ్యులు రజనీ రెడ్డి, వనజ 300 మంది సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంనకు భారీగా వరదనీరు..ఏడుగేట్లు ఎత్తివేత

**నంద్యాల,జూలై29(జై భీమ్ న్యూస్):**

శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వస్తోంది. 7 గేట్లు- 10 అడుగులు ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ఇన్ ఎ÷-లో 2,59,116 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఎ÷-లో 2,55,811 క్యూసెక్కులు ఉన్నట్లు- అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 883 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. శ్రీశైలం నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీ-ఎంసీలుకాగా ప్రస్తుతం నీటి నిల్వ 204.7880 టీ-ఎంసీలుగా ఉంది.

## నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన ములుగు జిల్లా ఎస్పీ శబరిష్.ఐపిఎస్

**ములుగు, జై భీమ్ న్యూస్**






ములుగు జిల్లా కేంద్రం లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ డా. శబరిష్.పి,ఐపీఎస్ నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్, సస్పెక్ట్ షీటర్స్ గురించి ఆరా తీసి, వారిని ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ ఉండాలని, వారి వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా కోర్టులో ట్రయల్ లో ఉన్న కేసుల గురించి ఆరా తీసి, ప్రతికేసులోను తప్పనిసరిగా సాక్షులకు, ముద్దాయిలకు సమన్లు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. నేరస్తులకు శిక్ష పడే విధంగా కోర్టు కానిస్టేబుల్‌లు విధులు నిర్వహించాలని, అంతిమంగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలలో నమోదైన కేసుల వివరాలపై పోలీస్ స్టేషన్ ల వారీగా ఆరా తీసి, కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ప్రతి కేసులోనూ ఎప్పటికప్పుడు ఆన్లైన్లో ఫైల్ అప్డేట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దొంగతనాలు, ఆర్థిక నేరాలలో ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా దర్యాప్తును ముమ్మరం చేయాలని, పోగొట్టుకున్న నగదు లేదా వస్తువులను బాధితులకు అప్పగించేలా కృషి చేయాలి అని సూచించారు. పాత కేసుల దర్యాప్తులో పురోగతిని పరిశీలించి, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని, బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రజలలో అవగాహన తీసుకొని వచ్చి కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలలో అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. మహిళలపై జరిగే నేరాలలో వీలైనంత త్వరగా విచారణ చేసి పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలి అని ఆదేశించారు. యువత, ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా సైబర్ క్రైమ్ నేరాలపై ఆయా పోలీస్ స్టేషన్ ల పరిధి లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ ఐపీఎస్, డిసిఆర్బి డిఎస్పి కిషోర్ కుమార్, ములుగు డీఎస్పీ రవీందర్, ములుగు జిల్లా సిఐలు ఎస్ఐలు మరియు వివిధ శాఖల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆస్తి తగాదాల విషయంలో తోడబుట్టిన తమ్ముని భార్య పిల్లలను చితకబాదిన ఘటన

**కనిపర్తి గ్రామంలో చోటుచేసుకుంది.**

**ఇరువర్గాలపై కేసులు నమోదు ఇన్స్పెక్టర్ హరికృష్ణ**

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం కనిపర్తి గ్రామంలో తాతల వారసత్వం నుండి వస్తున్న ఆస్తి తగాదాల విషయంలో వడ్లకొండ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు తన తమ్ముడి భార్య వడ్లకొండ విజయ, కూతురు స్రవంతిలపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు గ్రామస్తులు. ఎంజీఎంలో వారు చికిత్స పొందుతున్న పరిస్థితి. పోలీసులు దాడి చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. తోడబుట్టిన తమ్ముడు చనిపోయాడన్న కనికరం లేకుండా తమ్ముని భార్య పిల్లలపై దాడి చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి కనిపర్తిలో నెలకొంది. ఈ విషయంలో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు కమలాపూర్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు: ఎసై సృజన్ కుమార్


**దేవరప్పులు, జై భీమ్ న్యూస్**



జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని దాదా సాహెబ్ కాలనీ పరిధిలోని వాగు నుండి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న దాదా సాహెబ్ కాలనీకి చెందిన ఎస్కే కరీం, ఎస్కే సాల ట్రాక్టర్లను పట్టుకొని అదుపులోకి తీసుకుని ట్రాక్టర్లను స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించి వారిపై కేసు నమోదు చేసిన దేవరుప్పుల మండల ఎస్సై ఊర సృజన్ కుమార్. పర్మిషన్ లేకుండా వాగు నుండి అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుకను ఇతర మండలాలకు గానీ, గ్రామాలకు గానీ తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డికి మూడవసారి ఉత్తమ పోలీసు అవార్డు

**ములుగు, జై భీమ్ న్యూస్**



ములుగు జిల్లాలోని 10 పోలీస్ స్టేషన్లో ఉత్తమంగా పనిచేసిన ఓ ఎస్ ఐ కి ప్రతి నెల ఉత్తమ ఎస్ఐ అవార్డు ఇస్తున్నారు దీనిలో భాగంగా 2025 మే జూన్ జూలై వరుసగా మూడుసార్లు తాడ్వాయి పోలీస్ స్టేషన్ లోని అన్ని రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి అవార్డు ఎంపికయ్యారు. ఈ అవార్డును ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.పి శివం ఉపాధ్యాయ డి.ఎస్.పి రవీందర్ పాల్గొన్నారు.

# సిరోల్ పోలీస్ స్టేషన్ మరియు మరిపెడ పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకాన్, ఐపిఎస్

**మహబూబాబాద్, జై భీమ్ న్యూస్**

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకాన్, ఐపిఎస్ సిరోల్ పోలీస్ మరియు మరిపెడ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా , రికార్డుల నిర్వహణతో పాటు నామినల్ రోల్ , ప్రాపర్టీ రూమ్ ను సమీక్షించారు. అంతేకాక, స్టేషన్ పరిసరాలను తిరిగి పరిశీలించారు, శుభ్రత మరియు భద్రతాపరమైన ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు, కోర్టు కేసులు, లాంగ్ పెండింగ్ కేసులను పరిశీలిస్తూ, విచారణను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. విచారణలో ఏవైనా సందేహాలుంటే ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలని రెండు స్టేషన్ల ఎస్‌హెచ్ఓ లకు సూచించారు. పోలీస్ సిబ్బందికి ఉన్న సమస్యలను తెలుసుకొని స్పందించారు. ప్రత్యేకంగా మరిపెడ లో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ నీ పరిశీలించీ స్టేషన్ ఆవరణలో స్వయంగా ఎస్పీ మరియు తొర్రూర్ డిఎస్పి కే కృష్ణ కిషోర్ మొక్కలు నాటడం జరిగింది. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి సిబ్బంది అన్నిరకాల విధులను తెలుసుకొని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం ద్వారా మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించేలా




ఉండాలని సూచించారు. వివిధ విభాగాల్లో మెరుగైన పనితీరు చూపి జిల్లా పేరు మెరుగుపడేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా మాట్లాడాలని, 24×7 అందుబాటులో ఉండి శాంతి భద్రతలు కాపాడేలా విధులు నిర్వహించాలని సూచించారు. ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్స్, రోడ్డు ప్రమాదాలపై కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రామ్స్ ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. నేరాల నివారణకు, విచారణకు కీలకంగా ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, వీటి ఏర్పాటు కోసం ప్రజలను ప్రోత్సహించాలని చెప్పారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా గ్రామాలపై అవగాహన కలిగి ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మరిపెడ సీఐ రాజకుమార్ డిసిఆర్బి సిఐ సత్యనారాయణ సిరోలు ఎస్సై సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్






**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

పరకాల పట్టణంలో పలువురు లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి గురించి లబ్ధిదారులు, అధికారులతో కలెక్టర్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు కలెక్టర్ సూచించారు. అదేవిధంగా సైడ్ డ్రైనేజీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ కే నారాయణ, తహసిల్దార్ విజయలక్ష్మి, పురపాలక కమిషనర్ సుష్మ, ఎంపీడీవో ఆంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 4వేల టన్నుల బొగ్గు మాయంపై హైకోర్టు ఆగ్రహం

**వానదేవుడే బొగ్గును మాయం చేశాడు**
**భారీ వర్షాలకు కొట్టుకు పోయి ఉంటుంది**
**మేఘాలయ మంత్రి ఆసక్తికర సమాధానం**

**షిల్లాంగ్,జూలై29(జై భీమ్ న్యూస్) :**

మేఘాలయాలో సుమారు నాలుగు వేల టన్నుల బొగ్గు అదృశ్యమైంది. ఆ నల్ల బంగారం మాయం కావడం పట్ల రాష్ట్ర సర్కారుపై హైకోర్టు సీరియస్ అయ్యింది. బొగ్గు ఎక్కడికెళ్లిందో చెప్పాలని కోర్టు నిలదీసింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన ఎక్సైసజ్ శాఖ మంత్రి కిర్మెన్ షిల్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బహుశా వర్షాలు, వరదల వల్ల ఆ బొగ్గు కొట్టుకుపోయి ఉంటుందని ఆయన అన్నారు. జోరు వానల వల్ల బొగ్గు మాయమై ఉంటుందన్నారు. రాజాజు, డెంగన్‌గాన్ గ్రామాల్లో ఉన్న బొగ్గు నిల్వల నుంచి సుమారు 4 వేల టన్నుల బొగ్గు కనిపించకుండాపోయింది. ఆ కేసులో అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బొగ్గు మాయం గురించి అడిగిన సమయంలో మంత్రి మాట్లాడుతూ.. మేఘాలయాలో అత్యధిక వర్షపాతం కురుస్తుందని, మీకు ఈ విషయం తెలియదని, ఆ వానల వల్ల బొగ్గు కొట్టుకుపోయే ఛాన్సు ఉందని అన్నారు. బొగ్గు ఎలా అదృశ్యమైందో చెప్పడం తన ఉద్దేశం కాదు అని, సహజ పద్ధతిలో ఆ బొగ్గు మాయమైందా లేక అక్రమ విధానాల వల్ల అది పోయిందా అన్న విషయాన్ని తేల్చలేకపోతున్నట్లు- ఆయన చెప్పారు. మేఘాలయాలో 2014 నుంచి బొగ్గు మైనింగ్‌ను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆపేసింది. పర్యావరణ కారణాలు, అసురక్షిత పద్ధతుల వల్ల బొగ్గు తొవ్వకాలను నిలిపివేశారు. మేఘాలయాలో అక్రమ రీతిలో మైనింగ్ జరుగుతున్నట్లు- ఆరోపణలు ఉన్నాయి. అయినా ఈ ఏడాది ఆరంభంలో ఈస్ట్ జైంతియా కొండల్లో బొగ్గు మైనింగ్‌ను ప్రారంభించారు. ఒకవేళ బొగ్గు మాయమైనా.. అది బ్రతకడం కోసమైతే అక్రమంగా జరిగి ఉంటుందేమో అని, లేదంటే ఆ బొగ్గును ఎవరు తీసుకెళ్తారని మంత్రి అన్నారు.

# కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష

**రద్దయ్యిందన్న వార్తలను ఖండించిన కేంద్రం**

**న్యూఢిల్లీ,జూలై29(జై భీమ్ న్యూస్):**

కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దయ్యిందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఖండించాయి. అవన్నీ అవాస్తవమని పేర్కొన్నాయి. నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దు కాలేదని మంగళవారం వెల్లడించాయి. నిమిష ఉరిశిక్షను రద్దు చేస్తూ యెమెన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందంటూ భారత గ్రాండ్ ముఫ్తీ, సున్నీ మత ప్రబోధకుడు కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ కార్యాలయం సోమవారం రాత్రి ప్రకటించింది. అక్కడ జరిగిన ఉన్నత స్థాయి భేటీలో ఉరిశిక్షణ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది. దీనిపై భారత విదేశాంగ శాఖ వర్గాలు తాజాగా స్పందించాయి. నిమిష మరణశిక్ష రద్దు చేశారంటూ కొంత మంది వ్యక్తులు నుంచి వచ్చిన సమాచారం అవాస్తవమని వెల్లడించాయి. ఈ విషయంపై తమకు యెమెన్ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక సమాచారం రాలేదని పేర్కొన్నాయి.యెమెన్ జాతీయుడు మహద్ హత్యకేసులో నిమిష ప్రియకు మరణశిక్ష పడిన విషయం తెలిసిందే. మహద్‌తో కలిసి ఆమె వ్యాపారం చేసింది. అయితే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఆమె తన పాస్‌పోర్టు కోసం అడిగింది. కానీ పాస్‌పోర్టు ఇచ్చేందుకు మహద్ నిరాకరించడంతో అతడికి మత్తుమందు ఇచ్చి తీసుకునేందుకు నిమిష ప్రయత్నించింది. అయితే డోస్ ఎక్కువ కావడంతో మహద్ మరణించాడు. దాంతో యెమెన్ పోలీసులు నిమిషను హత్య కేసులో అరెస్ట్ చేశారు. ఆమె ముందుగా స్థానిక కోర్టు మరణశక్ష విధించింది. ఆ శిక్షను టాప్ కోర్టు సమర్థించింది. దాంతో ఈ నెల 16న నిమిషకు ఉరిశిక్ష అమలు చేయనున్నట్లు- ప్రకటించారు. నిమిషకు శిక్ష తప్పించేందుకు చివరి నిమిషం వరకు ప్రయత్నించిన భారత ప్రభుత్వం.. ఇక తాను చేసేదేమీ లేదని చేతులెత్తేసింది. జూలై 16న అమలు చేయాల్సిన మరణశిక్ష చివరి నిమిషంలో వాయిదా పడింది.

# ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మహబూబాబాద్ నందు షీ టీం అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఎస్సై సునంద

**విద్యార్థి దశలో చదువు చాలా ముఖ్యం.**
**చదువుకునే సమయంలో చెడు ఆలోచనలకు తావివ్వద్దు.**
**గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు తెలుపవద్దు.**
**ధైర్యంగా ఫిర్యాదు చేయాలి.**
**బాలల రక్షణ చట్టాలు మరియు చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలి.**

**మహబూబాబాద్, జై భీమ్ న్యూస్**

మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ ఆదేశానుసారంగా మహబూబాబాద్ టౌన్ పిఎస్ పరిధిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మహబూబాబాద్ నందు షీ టీం, భరోసా, మరియు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలపై షీ టీం ఎస్ఐ సునంద మరియు భరోసా ఎస్ఐ ఝాన్సీ సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై సునంద మాట్లాడుతూ బాలికల భద్రత షీ టీం లక్ష్యం అని తెలిపారు. కళాశాలలో కానీ, బయట కానీ, ఎక్కడైనా ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురిచేసిన, వేధించి ఇబ్బంది కలిగించిన, లేదా ఇబ్బందికరంగా మాట్లాడిన, తమకు ఫిర్యాదు చేయాలని, విద్యార్థినిలు చిన్న విషయాలకు ఆవేదనలకు గురికాకూడదని, మంచి ఆలోచనలతో చదువుకోవాలని సూచించారు. మహిళలపై కానీ, విద్యార్థినిలపై కానీ వేధింపులు జరిగినట్లయితే మా షీ టీం వాట్సాప్ నెంబర్ 8712656935 నాకు సమాచారం అందించాలని తెలిపినారు. ప్రత్యేకంగా ప్రధాన కూడలిలో, చౌరస్తాలలో, బస్టాండ్, రైల్వే స్టేషన్ ముఖ్యమైన టెంపుల్స్ ,పార్కులు ప్రాంతాలలో నిరంతరం షీ టీంలు పనిచేస్తాయని బాధితులు100 లేదా షీ టీం నెంబర్ అయినా 8712656 935, నెంబర్ కానీ ఫోన్ చేసి వివరాలు తెలపాలని కోరారు. మహిళలు విద్యార్థినిలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇలాంటి బెదిరింపులకు భయపడవద్దని అవగాహన కల్పించారు. ప్రయాణాలలో మహిళలు మరియు విద్యార్థినిలు అందరూ తప్పనిసరిగా ట్రావెల్ షేప్ యాప్ ని ఉపయోగించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని, ఇట్టి యాప్ ని ఉపయోగించడం వలన ప్రయాణం సురక్షితంగా ఉంటుందని, ప్రయాణంలో పోలీసు సహాయం తప్పక ఉంటుందని వివరించారు. సమాజంలో మహిళలు మరియు బాలికలు తెలిసిన వారితోనే ఎక్కువ వేధింపులకు గురవుతున్నారని, అలాంటప్పుడు జాగ్రత్త పడాలి తప్ప అధైర్య పడవద్దు అని, వేధింపులకు పాల్పడిన వారి వివరాలతో షీ టీం ని సంప్రదించి ఫిర్యాదు చేస్తే అట్టి వారి ఆట కట్టించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఫిర్యాది వివరాలు గోప్యంగా ఉంచబడతాయని సూచించారు. భరోసా ఎస్సై ఝాన్సీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళ వర్గంపై జరుగుతున్న నేరాలు, ఇలాంటి చర్యల నుండి మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి మరియు విద్యార్థినిలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ లపై అవగాహన, ఫోక్సో చట్టం చట్టం గురించి భరోసా యొక్క పనితీరు విధులు గురించి మరియు బాలల రక్షణ చట్టాల గురించి వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి సదానందం మరియు అధ్యాపక సిబ్బంది, మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# హత్య కేసులో నిందితునికి యావత్ జీవ కారాగార శిక్ష

**30 వేల జరిమానా**
**మృతుని తల్లికి ఎనిమిది లక్షల పరిహారం**
**కాల్ డాటా తో నిందితుని పట్టివేత**
**డిఎన్ఏ పరీక్షతో మృతుని గుర్తింపు**

**జై భీమ్ న్యూస్, వరంగల్**

అక్రమ సంబంధానికి అడ్డుగా నిలుస్తున్నాడని భావించి మృతుని భార్య సహకారంతో ఆమె భర్తను హత్య చేసిన నిందితుడికి యావత్ జీవ కారాగార శిక్ష విధిస్తూ వరంగల్ జిల్లా రెండవ అదనపు సెషన్స్ జడ్జ్ మనీషా శ్రావన్ ఉన్నం మంగళవారం సంచలన తీర్పు వెలువరించారు. మృతునికి శిక్షతోపాటు 30 వేల జరిమానా విధించడమే కాక మృతుని తల్లికి ఎనిమిది లక్షల పరిహారాన్ని చెల్లించవలసిందిగా ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తీర్పు ప్రకటించారు. ఈ కేసులో మృతుని గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలు చేయించడమే గాక నేరస్తుల్ని పట్టుకోవడం కోసం నేరస్తుల కాల్ దాటాను సాక్షాలుగా సేకరించడం ఈ కేసులో విశేషం. కేసు పూర్వపరాల్లోకి వెళితే ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన దావూద్ చిన్నపాటి రైతు, అతడికి ఒక ట్రాక్టర్ ఉండేది,ఆ ట్రాక్టర్ నడపడం కోసం బుధరావుపేట శివారు భోజ్య తండా నివాసి కునుసోత్ రవి అని ట్రాక్టర్ డ్రైవర్ను నియమించుకున్నారు. సదర్ డ్రైవర్ వివాహితుడు. వ్యవసాయ పనుల సందర్భంలో డ్రైవర్ కు టిఫిన్ తీసుకువచ్చే సందర్భంలో డ్రైవర్ భార్య భారత్ కి నిందితుడు దావూద్ కు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి ఒకరినొకరు విడిచి ఉండలేని పరిస్థితికి చేరుకున్నారు. విషయాన్ని గ్రహించిన రవి నిందితుడు దావూద్ దగ్గర కొంతకాలం పని మానివేశారు, రవి పనిలో లేకపోవడంతో రవి భార్యతో చనువుగా ఉండే అవకాశం లేకుండా పోయింది ,ఈ సందర్భంలో మృతుని భార్య భారతి ప్రోద్బలంతో రవి తిరిగి దావూద్ దగ్గర ట్రాక్టర్ డ్రైవర్ గా ఉద్యోగంలో చేరాడు, అప్పుడప్పుడు వీధి మధ్య చిన్న చిన్న తగాదాలు జరుగుతుండేవి. ఆ తగాదాల వల్ల వీరిద్దరి శారీరక సంబంధానికి ఆటంకాలు ఏర్పడేది. ఎలాగైనా రవిని అడ్డు తొలగిస్తే తప్ప తాము నిత్యం కలుసుకోలేమని భావించి రవిని కడతేర్చాలని నిర్ణయానికి దావూద్ మరియు అతని ప్రేయసి భారతి పథకం వేసుకున్నారు. అందులో భాగంగా 23-4-2021 రోజున సాయంత్రం మందు తాగే కారణముతో మృతుని వ్యవసాయ క్షేత్రం వద్దకు పిలిపించి అక్కడ మృతునికి పరిమితికి మించి మద్యాన్ని తాగించాడు. మద్యం మత్తులో ఉన్న మృతుని సమీప భావి వద్దకు నీరు తాగుదామని తీసుకువెళ్లి తాగిన మైకము లో ఉన్న మృతుని తలపై కర్రతో కొట్టి చంపి వేస్తాడు. అనంతరం మృతుని ఆ బావిలోనే వేసి వెళ్ళిపోతాడు. మరుసటి రోజు బావి వద్దకు వచ్చి చూడగా మృతదేహం నీటిపై తేలుతుండడంతో ఎవరికి అనుమానం రావద్దని మృతుడు శవాన్ని బండరాళ్లు, తాళ్లతో బంధించి నీటిలోపులే ఉండేలా ఏర్పాటు చేస్తాడు. అతన్ని చంపే ముందు చంపిన తర్వాత కూడా నిందితుడు అతని భార్య భారతికి చంపిన విషయాన్ని తెలియజేస్తాడు. ఆ తర్వాత మృతుడు ఎంతకీ ఇంటికి రావడం లేదని గ్రహించిన అతని తల్లి తన కొడుకు కనిపించడం లేదంటూ ముందుగా ఖానాపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తుంది. ఈ ఫిర్యాదు పై స్పందించిన పోలీసు విభాగం లోతైన విచారణ చేసి చివరికి ట్రాక్టర్ యజమాని దావూద్ ను అనుమానిస్తారు. మృతుడు ఇంటి నుండి అదృశ్యమైన రోజున నిందితుని ఫోన్ నుండి మృతుని భార్య ఫోన్ కు అనేక సార్లు ఫోన్ సంభాషణ జరగడాన్ని గమనించి నిందితుని అదుపులోకి తీసుకోగా, మృతుడు చనిపోయిన రెండు నెలల తర్వాత తానే ఈ నేరం చేశానని అతని భార్య ప్రోద్బలంతో ఈ దురాగతానికి పాల్పడిన నిందితుడు తన నేరాన్ని అంగీకరించారు. నేరస్తుని వాంగ్మూలము ఆధారంగా బావిలో నుండి మృతుని శవాన్ని వెలికి తీయగా కేవలం ఎముకల గూడు మాత్రమే లభించింది. సదరు ఎముకలు మృతుడు రవి వే అని నిర్ధారించడం కోసం అతని తల్లి ఎముకను మృతుని శవం నుండి సేకరించిన ఎముకలను డిఎన్ఏ పరీక్ష కోసం పంపించగా ఫోరెన్సిక్ సైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పాండు బావిలో దొరికిన ఎముకలు మృతుడు రవి కి సంబంధించి నవే అని నిర్ధారించారు. పైగా కాల్ డేటా ఆధారంగా నిందితుడు మరియు మృతుని భార్య జరిపిన సంభాషణలు ఆధారంగా సరైన శాస్త్రీయ ఆధారాలు సేకరించి అప్పటి నర్సంపేట ఏసిపి ఆర్.వి ఫణిందర్ నిందితులు ఇద్దరిపై హత్యా నేరం మోపి సాక్షాదారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. లైజన్ ఆఫీసర్ కంతేటి హరికృష్ణ పర్యవేక్షణలో కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ నమిండ్ల మహేష్ సాక్షులను కోర్టు లో ప్రవేశపెట్టారు ఈ కేసును మొదటగా అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ గౌడ్ వాదించగా ప్రస్తుత పబ్లిక్ ప్రాక్యూటర్ సంతోషి ఈ కేసును వాదించి నేరాన్ని రుజువు చేశారు. సాక్షాదారాలను పరిశీలించిన న్యాయమూర్తి మనీషా శ్రావన్ ఉన్నం మృతుని భార్యపై సరైన సాక్షాధారాలు లేవని భావిస్తూ ఆమెపై కేసును కొట్టివేస్తూ, మొదటి ముద్దాయి దావుద్ హత్య చేసినట్టుగా నిర్ధారించి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. కొందరు సాక్షులు ప్రాసిక్యూషన్ కేసు కు సహకరించకున్నా డీఎన్ఏ, కాల్ డాటా తదితర శాస్త్రీయ ఆధారాలతో నిందితుడు నేరం చేశాడని నిర్ధారించి శిక్ష వేయడం విశేషం.

జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem



# చందమామల కథ స్ఫూర్తితో విశ్వంభర

చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో రానున్న సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర'కి సంబంధించిన ఆసక్తికర విషయాల కోసం చిరు అభిమానులతో పాటు- సినీప్రియులంతా ఎదురుచూస్తున్నారు. తాజాగా చిత్ర దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని సంగతులు పంచుకున్నారు. దీని టీజర్ విడుదలయ్యాక 'అవతార్'కు కాపీ అంటూ వచ్చిన ట్రోల్స్‌పై మాట్లాడారు. టీజర్ నాకు నచ్చింది కాబట్టి నేను రిలీజ్ చేశాను. అందులో కనిపించిన పాప కాస్ట్యూమ్‌ను చూసి అందరూ నేను అవతార్ సినిమా కాపీ చేసి దాన్ని రూపొందించానని అన్నారు. టీజర్‌లో కనిపించిన కొండలు,ఆ పాప చెవులు చూసి అలా భావించారు. కానీ, కొండలను 'అవతార్' కంటే ముందు ఎన్నో సినిమాల్లో చూపించారు. ఇక చెవులు కూడా పెద్దగా ఉండడం గతంలో చాలా సినిమాల్లోని పాత్రల్లో చూపారు. నేను చందమామ కథలు చూసి స్ఫూర్తి పొంది అలా కాస్ట్యూమ్ డిజైన్ చేయించాను. అవతార్ చూసి కాపీ కొట్టాననే బదులు ఈ కథలను చూసి కాపీ కొట్టాను అంటే చాలా ఆనందించేవాడిని. చందమామ కథల్లో జ్వాలాదీపం అనే సిరీస్ ఉంటుంది. అందులో ఉన్నవే అవతార్‌లో చూపించారని అన్నారు. ఇందులో ఐదుగురు హీరోయిన్స్ ఉన్నారంటూ వార్తలు వస్తున్నాయి. మెయిన్ హీరోయిన్ త్రిష, సెకండ్ లీడ్ ఆషిక వాళ్లిద్దరు మాత్రమే ఉన్నారు. విడిగా నటీమణులు కొన్ని పాత్రల్లో కనిపిస్తారు. స్క్రీన్‌పై వీళ్లందరూ చాలా ఫ్రెష్‌గా ఉంటారు. వీఎఫ్ఎక్స్ వర్క్ కారణంగానే దీని విడుదల ఆలస్యమవుతుంది. ఇక ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు.







## విజయవాడ వేదికగా 10న వార్-2 ప్రీరిలీజ్ వేడుక

యంగ్ టైగర్ ఎన్టీఆర్ భారీ మల్టీస్టారర్ వార్ 2. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ తో కలిసి నటిస్తున్నాడు. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, గ్లిమ్స్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేశాయి. కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తోంది. బాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తుండగా అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ భారీ బడ్జెట్ చిత్రం ఏడాది ఆగస్టు 14 న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. రిలీజ్ కు గట్టిగా రెండు వారాలు ఉంది. ఇద్దరు బడా స్టార్స్ ఉన్న సినిమాకు ప్రస్తుతం ఉన్నబజ్ సరిపోదు. అందుకే తెలుగు హక్కులు దక్కించుకున్న నిర్మాత కమ్ డిస్ట్రిబ్యూటర్ వార్ 2 కోసం భారీ ఎ÷-లానింగ్ రెడీ చేస్తున్నాడు. అందులో భాగంగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కు రంగం సిద్ధం చేస్తున్నాడు. కానీ ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ తో సెన్సేషన్ క్రియేట్ చేయాలనీ నాగవంశీ వ్యూహ రచన చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో విజయవాడ లో ఆగస్టు 10న వార్ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించనున్నారు. నిన్న, మొన్నటి వరకు కేవలం ఊహాగానాలు వినిపించగా ఇప్పుడు అక్కడే ఫిక్స్ చేసినట్టు- తెలుస్తోంది. ఈ వేడుకకు యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో పాటు- బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కూడా హాజరుబోతున్నారట. అదే జరిగితే వార్ 2 ఈవెంట్ హిస్టారీ క్రియేట్ చేయడం ఖాయం.

## సతీ లీలావతిగా లావణ్య త్రిపాఠి

లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సతీ లీలావతి' తాతినేని సత్య ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. తాజాగా దీని టీ-జర్‌ను టీ-మ్ విడుదల చేసింది. సోషల్ మీడియాలో వచ్చే కౌంటర్స్, సరదాగా సాగే పంచ్‌లతో ఈ వీడియో నవ్వులు పూయిస్తోంది. మిక్కీ జే మేయర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు.

## మహావతార్ నరసింహ అద్భుతం

**చిత్ర బృందాన్ని మెచ్చుకున్న ప్రభాస్**

ప్రస్తుతం భారతీయ బాక్సాఫీస్ వద్ద పురాణగాథలకు మంచి డిమాండ్ ఉంది. తెలిసిన కథే అయినా ఆసక్తికరంగా తీర్చిదిద్ది అందిస్తే ప్రేక్షకులు ఆదరిస్తున్నారని ఇటీవల పలు సినిమాలు నిరూపించాయి. ఇప్పుడు ఇదే బాటలో పయనిస్తోంది 'మహావతార్ నరసింహ', ప్రముఖ నిర్మాణసంస్థ హోంబలే ఫిల్మ్స్ నుంచి వచ్చిన ఈ విజువల్ వండర్‌కు చిన్నా, పెద్దా అందరూ ఫిదా అవుతున్నారు. ముఖ్యంగా 3డీలో సరికొత్త అనుభూతిని పంచుతోంది. తాజాగా మూవీని చూసిన అగ్ర కథానాయకుడు ప్రభాస్ చిత్ర బృందాన్ని మెచ్చుకున్నారు. పవర్‌ఫుల్ విజన్‌తో 'మహావతార నరసింహ'ను వాస్తవంలోకి తీసుకొచ్చిన హోంబలే ఫిల్మ్స్‌కు శుభాకాంక్షలు. సినిమా నాకెంతో నచ్చింది. యానిమేషన్ రూపంలో తీర్చిదిద్దిన యాక్షన్ సన్నివేశాలు, కథాగమనం అద్భుతంగా ఉన్నాయి. ఈ అపురూప విజయం సాధించిన దర్శకుడు అశ్విన్‌కుమార్, చిత్ర బృందానికి అభినందనలని పేర్కొన్నారు. ప్రభాస్ పోస్ట్‌కు హోంబలే చిత్రబృందం స్పందించింది. సినిమాపై ఆయన అభిప్రాయంపై కృతజ్ఞతలు తెలిపింది.



## తరుణ్‌కు హిట్ ఇచ్చిన నువ్వులేక నేను లేను..



2002లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన అందమైన కుటుంభ ప్రేమకథ చిత్రం 'నువ్వు లేక నేను లేను'. హీరో తరుణ్ కు మంచి బ్రేక్ ఇచ్చిన సినిమా ఇది. కానీ ఈ సినిమాలో అసలు మొదటగా మహేశ్ బాబు తో చేయాలనుకున్న విషయం ఆసక్తికరంగా మారింది. తాజాగా ఈ సినిమాకి దర్శకత్వం వహించిన కాశీ విశ్వనాథ్ ఒక ఇంటర్వ్యూలో ఈ ఆసక్తికర విషయం వెల్లడించారు.. సినిమా స్క్రిప్ట్ రెడీ అయిన తర్వాత, నిర్మాత సురేష్ బాబు ఈ కథను మహేశ్ బాబుతో చేద్దామా? అని అడిగారు. దానికి కాశీ విశ్వనాథ్ స్పందిస్తూ - 'మహేశ్ తో సినిమా అంటే ఇంకా ఆలస్యం అవుతుంది. ఆయన డేట్స్ కోసం పెద్ద లైన్ ఉంటుంది. ఇప్పటికే నాకు ఆలస్యమైంది. ఇదే తరుణ్‌కు బాగా సరిపోతుందని చెప్పారు. అలా చివరికి మహేశ్ బాబు అవకాశాన్ని వదిలివేయడంతో తరుణ్ ఛాన్స్ దక్కించుకున్నాడు. ఈ చిత్రం విడుదలై మంచి విజయాన్ని సాధించడంతో పాటు-, ఆయన కెరీర్‌కు మరో మైలురాయిగా నిలిచింది' అని తెలిపారు.. ఒక కథ, ఒక నిర్ణయం.. నటుడి భవిష్యత్తునే మార్చేస్తుంది అనడానికి ఇదే నిదర్శనం.

## ఉస్తాద్ భగత్ సింగ్ క్లైమాక్స్ పార్ట్ పూర్తి



పవన్ కల్యాణ్ అభిమానులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఒకటి. పవన్ కల్యాణ్ - హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ అప్‌డేట్‌ను నిర్మాణసంస్థ తాజాగా షేర్ చేసింది. దీని -క్లైమాక్స్ పూర్తయినట్లు- తెలిపింది. పవన్ కల్యాణ్ ఎంతో అంకితభావంతో దీని షూటింగ్‌లో పాల్గొన్నారంటూ ఆయనకు కృతజ్ఞతలు చెప్పింది. ఎన్నో భావోద్వేగాలతో కూడిన ఉస్తాద్ భగత్‌సింగ్ క్లైమాక్స్ పూర్తయింది. నబకాంత మాస్టర్ పర్యవేక్షణలో యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ- సీఎంగా బాధ్యతలను నిర్వర్తిస్తూనే.. మరోవైపు 'హరి హర వీరమల్లు' ప్రచారంలో పవన్ కల్యాణ్ భాగమయ్యారు. అదే మెరుపు వేగంతో 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్‌లో కూడా పాల్గొన్నారు. ఇది ఆయన అంకితభావానికి, కష్టపడి పనిచేసే స్వభావానికి నిదర్శనమని నిర్మాణ సంస్థ తెలిపింది ఈ విషయాన్ని తెలుపుతూ సెట్‌లో పవన్, హరీశ్ శంకర్‌ల ఫొటోను పంచుకుంది. గబ్బర్ సింగ్' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రానున్న చిత్రం కావడంతో దీనిపై సినీప్రియులు ఎన్నో అంచనాలు పెట్టుకున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, స్పెషల్ వీడియోలు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. ఇక పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM